అన్నీ కాదు.. ఒక్కటే..!



19వ క్రస్ట్‌గేట్‌కు ఏర్పాటు చేస్తున్న స్టాప్‌లాగ్ ఎలిమెంట్స్ (ఫైల్)

- తుంగభద్ర డ్యాం 19వ క్రస్ట్‌గేట్ ఏర్పాటుకు టెండర్లు పిలిచిన టీబీపీ బోర్డు
- మొత్తం 33 గేట్లు మార్చాలని ఏకే బజాజ్ కమిటీ సూచనలు
- అధ్యయనం పేరిట కాలయాపన
- డ్యాం క్రస్ట్ గేట్ల సామర్థ్యంపై కేవీఎన్‌డీటీ సంస్థ సర్వే
- మూడు రోజుల్లో నివేదిక ఇచ్చే అవకాశం

కర్నూలు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): కర్ణాటక, ఆంధ్ర ప్రాంతాల జీవనాధారమైన తుంగభద్ర డ్యాం క్రస్ట్‌గేట్లలో అంతులేని జాప్యం జరుగుతోంది. గతేడాది ఆగస్టులో 19వ నంబరు క్రస్ట్‌గేట్ కొట్టుకుపోయింది. సీఎం చంద్రబాబు ప్రత్యేక చొరవ తీసుకోవడంతో క్రస్ట్‌గేట్ల నిపుణుడు కన్నయ్యనాయుడు డ్యాం వద్దే మకాంవేసి స్టాప్‌లాగ్ ఎలిమెంట్స్ ఏర్పాటు చేశారు. రెండు రాష్ట్రాల రైతుల కన్నీళ్లు తుడిచారు. డ్యాంను క్షేత్రస్థాయిలో పరిశీలించిన కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) మాజీ చైర్మన్ ఏకే బజాజ్ నేతృత్వంలోని నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) నిపుణుల కమిటీ మొత్తం 33 గేట్లు మార్చాలని, వాటి స్థానంలో అత్యాధునిక డిజైన్‌తో నూతన గేట్లు ఏర్పాటు చేయాలని, అంతకుముందు క్రస్ట్‌గేట్ల నిపుణులతో అధ్యయనం చేయించాలని సూచించింది. నెలలు గడిచినా ఒక్క గేటు మాత్రమే ఏర్పాటు చేస్తారా..? మొత్తం అన్ని గేట్లు మారుస్తారా..? అన్న విషయంపై తుంగభద్ర ప్రాజెక్టు బోర్డు అధికారులు స్పష్టత ఇవ్వకపోవడంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. ఈ అంశాలను ఆంధ్రజ్యోతి పలు కథనాలు ద్వారా వెలుగులోకి తెచ్చింది. ఫిబ్రవరి 22న 'గేటా.. గేట్లా..?!' శీర్షికన అధికారులు, పాలకుల నిర్లక్ష్యంపై వెలుగులోకి తెచ్చింది. ఎట్టకేలకు కొట్టుకుపోయిన 19వ నంబరు గేటు మాత్రమే మార్చాలని టీబీపీ బోర్డు ఇంజనీర్లు నిర్ణయం తీసుకున్నారు. దాదాపు రూ.2 కోట్లతో టెండర్లు పిలిచారు. జూన్ ఆఖరులోగా స్టాప్‌లాగ్ ఎలిమెంట్స్ తొలగించి నూతన క్రస్ట్‌గేటు ఏర్పాటు చేస్తామని తుంగభద్ర బోర్డు ఎస్‌ఈ (ఎఫ్‌ఏసీ) నారాయణనాయక్ ఆంధ్రజ్యోతికి వివరించారు.

కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర ఉమ్మడి ప్రాజెక్టు తుంగభద్ర జలాశయం. కరువు, వలసలతో తల్లడిల్లే రాయలసీమ ప్రాంతం కర్నూలు, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలకు ప్రాణాధారం ఈ ప్రాజెక్టు. కర్నూలు జిల్లాలో టీబీపీ ఎల్లెల్సీ కాలువకు డ్యాం నుంచి 24 టీఎంసీలు వాటా ఉంది. ఖరీఫ్, రబీ సీజన్‌లో 1.51 లక్షల ఎకరాలకు సాగునీరు, 195 గ్రామాలకు తాగునీరు అందించే ప్రధాన నీటివనరు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో టీబీపీ హెచ్చెల్సీ కాలువకు 32.50 టీఎంసీలు నీటి వాటా ఉంది. 2.85 లక్షల ఎకరాకలు సాగునీరు అందించాల్సి ఉంది. కేసీ కాలువకు 10 టీఎంసీలు నీటివాటా ఉంది. కర్నూలు, కడప జిల్లాల్లో 2.65 లక్షల ఎకరాలకు సాగునీరు, పలు గ్రామాలకు తాగునీరు ఇవ్వాల్సి ఉంది. 1953 నుంచి రెండు రాష్ట్రాల నీటి ప్రయోజనాలు కాపాడుతున్న తుంగభద్ర డ్యాం 19వ నంబరు క్రస్ట్‌గేట్ గత ఏడాది ఆగస్టులో వరద ఉధృతికి కొట్టుకుపోయిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేక చొరవ తీసుకొని.. క్రస్ట్‌గేట్ల నిపుణుడు కన్నయ్యనాయుడును డ్యాంకు పంపించారు. టీబీపీ బోర్డు, కర్ణాటక, ఏపీ ఇంజనీర్లను సమన్వయం చేసుకుంటూ కన్నయ్యనాయుడు పది రోజులకు పైగా శ్రమించి ఎట్టకేలకు 'స్టాప్‌లాగ్ ఎలిమెంట్స్' ఏర్పాటు చేశారు. వరద కడలిపాలు కాకుండా కాపాడిగలిగారు. తరువాత కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) మాజీ చైర్మన్ ఏకే బజాజ్ నేతృత్వంలోని నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) నిపుణుల కమిటీ క్షేత్రస్థాయిలో డ్యాంను, గేట్లను పరిశీలించారు. గేట్ల జీవిత కాలం తీరిపోయింది. మరమ్మతులతో కాలయాపన చేయకుండా మొత్తం 33 గేట్లు మార్చాలంటూ పలు సూచనలతో అదే ఏడాది సెప్టెంబరులో నివేదిక ఇచ్చింది. అయితే గేట్ల సామర్థ్యంపై క్రస్ట్‌గేట్ల నిపుణులతో అధ్యయనం చేయించాలని సూచన చేశారు. ఆ నివేదిక ఆధారంగా డిసెంబరు ఆఖరులోగా డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్టు (డీపీఆర్) తయారు చేయించాలని నవంబరులో జరిగిన టీబీపీ బోర్డు సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. నెలలు గడిచిపోతున్నా గేట్లు మార్చడంపై నిర్ణయం తీసుకోకుండా టీబీపీ బోర్డు అధికారులు జాప్యం చేస్తూ వస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తున్నాయి.



గత ఏడాది 13న తుంగభద్ర డ్యాం 19వ గేటు కొట్టుకుపోవడంతో వృథాగా పోతున్న వరద (ఫైల్)

19వ గేటు ఏర్పాటుకు టెండర్లు

సీడబ్ల్యూసీ మాజీ చైర్మన్ ఏకే బజాజ్ కమిటీ మొత్తం 33 గేట్లు మార్చాలని, అందులో 11 గేట్లు అత్యంత ప్రమాదకర స్థాయిలో ఉన్నాయని, వాటిని తక్షణమే మార్చాలని సూచించారు. మొత్తం గేట్లు కాకుండా ఈ ఏడాది కేవలం కొట్టుకుపోయిన 19వ నంబరు గేటుకు ఏర్పాటు చేసిన స్టాప్‌లాగ్ తొలగించి, ఆ స్థానంలో నూతన గేటు ఏర్పాటుకు దాదాపు రూ.2 కోట్ల వ్యయంతో తుంగభద్ర ప్రాజెక్టు బోర్డు హెచ్‌డబ్ల్యూ అండ్ హెచ్చెల్సీ డివిజన్ ఇంజనీర్లు ఈ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్లు పిలిచారు. ఈ నెల 11న ఆన్‌లైన్ టెండరు షెడ్యూల్ దాఖలుకు గడువు ఇచ్చారు. ఆ తర్వాత టెక్నికల్, ప్రైజ్ బిడ్‌లో ఓపన్ చేసి, అర్హత సాధించిన కాంట్రాక్ట్ సంస్థతో ఒప్పందం చేసుకొని మే నెలలో పనులు మొదలు పెడతామని ఇంజనీర్లు తెలిపారు. రెండు నెలల గడువులోగా అంటే జూన్ ఆఖరులోగా కొత్త గేటు ఏర్పాటు చేయాల్సి ఉంది. అయితే జూన్ ఆరంభంలో రుతుపవనాలు వచ్చి వర్షాలు కురిసి డ్యాంకు వరద పోటెత్తితే గేట్ ఏర్పాటు కష్టంగా మారుతుంది. ఆగస్టులో గేటు కొట్టుకు పోయింది. సెప్టెంబరులోనే నిపుణుల కమిటీ నివేదిక ఇచ్చింది. ఆ వెంటనే ప్రతిపాదనలు తయారు చేసి టెండర్లు పిలిచి పనులు చేపట్టి ఉంటే ఏప్రిల్ ఆఖరులోగా నూతన గేటు ఏర్పాటు చేసే అవకాశం ఉండేది.

మిగతా 6వ పేజీలో

ఏకకాలంలో దాడులు

- రియల్టర్ ఇళ్లు, వ్యాపార సముదాయాల్లో సోదాలు
- ఐదు బృందాలుగా విడిపోయిన పోలీసులు
- బెంగుళూరు వాసి ఫిర్యాదుతో దాడులు
- పలు రికార్డులు స్వాధీనం



తనిఖీలు చేస్తున్న పోలీసులు

నంద్యాల, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణానికి చెందిన ఓ రియల్టర్, అతడి సోదరుడితో పాటు మరో ఇద్దరికి(కుటుంబ సభ్యులు) చెందిన ఇళ్లు, వ్యాపార సముదాయాలపై బుధవారం పోలీసులు ఏకకాలంలో దాడుల చేశారు. ముందస్తుగానే పోలీసులు ఐదు బృందాలుగా విడిపోయి ఒకేసారి ఐదుచోట్ల మెరుపు దాడులు చేయడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నంద్యాల పట్టణానికి చెందిన రియల్ ఎస్టేట్, కాటన్ వ్యాపారి బొగ్గారపు నాగరాజు, బెంగుళూరుకు చెందిన మరొక రియల్ వ్యాపారి ఇట్టిన మను ఇద్దరు కలిసి రియల్ ఎస్టేట్‌తో పాటు పలు రకాల వ్యాపారాలు చేశారు. కొన్నేళ్లుగా ఇద్దరి మధ్య విభేదాలు రావడంతో ఒకరికి ఒకరు దూరంగా ఉన్నారు. అయితే వారు కలిసి చేసిన రియల్‌ఎస్టేట్ తదితర వ్యాపార వ్యవహారాలకు సంబంధించి ఆర్థిక లావాదేవీల సమస్య పరిష్కారం కాలేదు. ఇటీవల బొగ్గారపు నాగరాజు.. ఫేక్ డాక్యుమెంట్స్, ఫోర్జరీ సంతకాలు చేసి రూ. కోట్లలో అప్పులు సదరు రియల్టర్ మను ఇవ్వాల్సి ఉందని కోర్టుకు వెళ్లారు. కోర్టు నుంచి నోటీసులు రావడంతో మరో మను 20 రోజుల కిందట బొగ్గారపు నాగరాజు, అతని సోదరుడు బొగ్గారపు నాగప్రసాద్‌తో పాటు వారి కుటుంబ సభ్యులైన మరో ఇద్దరిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేసి విచారణకు హాజరుకావాలని నోటీసులు జారీ చేశారు. వారి నుంచి ఎలాంటి స్పందన లేదు. కోర్టు వారెంట్‌తో కర్నూలు డీఐజీ కోయ ప్రవీణ్, ఎస్పీ అదేశాలకు మేరకు.. గురువారం నగరంలోని 1,2,3 టౌన్ పోలీసు స్టేషన్‌తో పాటు రూరల్ పోలీసులు కలిసి ఐదు బృందాలుగా విడిపోయి ఆయా ఇళ్లతో పాటు వారికి చెందిన వ్యాపార సంస్థలపై ఆకస్మికంగా మెరుపుదాడులు చేశారు.

ఐదు చోట్ల.. ఐదు బృందాలు..

నగరంలోని సీఐలు సుధాకర్‌రెడ్డి, ఇస్మాయిల్, కంబగిరి రాముడు, శ్రీనివాసరెడ్డి కలిసి ఐదు బృందాలుగా ఏర్పడి నగరంలోని బాలాజీ కాంప్లెక్స్, శ్రీనివాస్‌నగర్‌లోని ఇళ్లతో పాటు ఓ అపార్ట్‌మెంట్, లలిత కాటన్ మిల్, ఐశ్వర్య కాటన్ మిల్, సౌందర్య కాటన్ మిల్ దుకాణాల్లో ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఈ నేపథ్యంలో వీరందరూ కూడా స్థానికంగా లేకపోవడం, ఇళ్లకు తాళం వేసి ఉండటంతో కోర్టు అదేశాలు మేరకు తాళాలు పగలకొట్టి క్షుణ్ణంగా తనిఖీలు చేశారు.

మిగతా 6వ పేజీలో

ఆర్‌యూలో ఉర్దూ మీడియం రగడ

- బీఎడ్ ఉర్దూ అనుమతుల కోసం మల్లగుల్లాలు ...
- వర్శిటీ అధికారులతో రెండు రోజులుగా యాజమాన్యాల చర్చలు
- అడ్డగోలు అడ్మిషన్లపై క్రిమినల్ కేసులు పెట్టాలి- విద్యార్థి సంఘాలు

కర్నూలు అర్బన్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీకి అనుబంధంగా 40 బీఎడ్ కళాశాలలు ఉన్నాయి. కానీ కొన్ని కళాశాలలకు ఉర్దూ మీడియంకు అనుమతి లేకున్నా ఇతర రాష్ట్రాల నుండి (ఒడిస్సా, పంజాబ్, కేరళ, బీహార్, పశ్చిమ బెంగాళ్) విద్యార్థులను చేర్చుకొని ఇంగ్లీష్ మీడియంలో పరీక్షలు రాసి ఉర్దూ మీడియంలో బీఎడ్ పట్టాలను(యూనివర్సిటీ అధికారులు బీఎడ్ కళాశాలల లోపాయికారి ఒప్పదంతో) మంజూరు చేస్తున్నారు. ఈ అక్రమ దందా 6 సంవత్సరాలుగా కొనసాగింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత గత నెలలలో నాగార్జున యూనివర్సిటీ పరిధిలో బీఎడ్ కళాశాల పేపర్ లీకేజీ వ్యవహారంతో ఒక్కసారిగా ఉర్దూ మీడియం అక్రమ దందా వెలుగులోకి వచ్చింది. దీనిపై విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సమాచారం అడగటంతో ఒక్కసారిగా రాయలసీమ యూనివర్సిటీ అధికారులు అలర్ట్ అయ్యారు. అందులో భాగంగా 2024 విద్యా సంవత్సరం ఉర్దూ మీడియంకు అనుమతులు ఇవ్వాలా? వద్దా? అని ఉన్నత విద్యామండలికి లేఖ రాసినట్లు సమాచారం. ఇన్ని సంవత్సరాలు ఉర్దూ మీడియం విద్యార్థులకు పట్టాలు మంజూరు చేసి ఇప్పుడు ఉన్నత విద్యామండలికి అనుమతులు ఇవ్వాలని లేఖ ఎలా రాస్తారు అని విద్యార్థి సంఘాలు ఆందోళనలకు సిద్ధం అవుతున్నాయి. అడ్డగోలు నియామకాలు చేపడుతున్న కళాశాలల యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, సహకరిస్తున్న వర్శిటీ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. గత రెండు రోజులుగా వర్శిటీలోని కొందరు అధికారులతో కొందరు యాజమాన్యాలు చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. ఎలాగైనా ఈ విద్యా సంవత్సరానికి అనుమతులు ఇవ్వాలని కోరడంతో ఓ అధికారి తాను అంతా సర్దుబాటు చేస్తానని హామీ ఇచ్చారని ప్రచారం జరుతున్నది. ఈ విషయాన్ని పరీక్షల విభాగం కంట్రోలర్ వద్ద ప్రస్తావించగా తాము అనుమతులపై స్పష్టత ఇవ్వాలని ఉన్నత విద్యామండలికి లేఖ రాశామని దాట వేశారు. అడ్మిషన్లకు సంబంధించి ఈనెల 11న చివరి తేది గడువు కావడంతో ఇతర రాష్ట్రాల విద్యార్థులు, కొన్ని కళాశాలల యజమానులు ఆందోళన చెందుతున్నారు.

పురాతన బావిలో పూడికతీత

- నీటి ఎద్దడి నివారణ కోసం గ్రామస్థుల యత్నం
- బావిలో నుండి బయటపడ్డ శిలా శాసనం



బయట పడిన శిలాశాసనం

కొలిమిగుండ్ల, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : ఒకప్పుడు ఊరందురూ ఆధారపడిన ఈ పురాతన బావి కాలక్రమేణ శిథిలావస్థకు చేరుకొని పూడిపోయింది. అయితే ఇటీవల గ్రామంలో తాగు నీటి కొరత ఏర్పడింది. దీంతో గ్రామస్థులు పూడికతీత పనులు మొదలుపెట్టారు. కొలిమిగుండ్ల మండలంలోని నందిపాడు గ్రామంలోని చౌడేశ్వరి ఆలయం ముందున్న పురాతన బావిలో నాలుగు రోజులుగా గ్రామస్థులు పూడికతీత పనులు చేపడుతున్నారు. బావి బయట ప్రత్యేక యంత్రాన్ని ఏర్పాటు చేసి పూడికను తోడుతున్నారు. దీంతో మట్టిలో కూరుకపోయిన అద్భుతమైన పురాతన బావి కట్టడం బయటపడింది.

బయటపడ్డ శిలాశాసనం: బావి పూడికతీత పనుల్లో ఓ బండ రాయిపై రాసి ఉన్న శిలాశాసనం బయట పడింది. సంస్కృతంలో రాసి ఉన్న శిలాశాసనం చౌడేశ్వరీ ఆలయ చరిత్రను తెలిపేదని స్థానికులు పేర్కొంటున్నారు. పురావస్తు అధికారులు ఈ రాతను వివరించాలని కోరుతున్నారు.

బోగస్ హాజరుతో నిధులు నొక్కేశారు..!

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

- వలసల నివారణకు సీజన్ హాస్టళ్లు
- ఒక్కో కేంద్రానికి నెలకు రూ.80 వేలు ఇస్తున్న ప్రభుత్వం
- బోగస్ హాజరుతో నిధులు స్వాహా చేసిన నిర్వహణ స్వచ్ఛంద సంస్థలు
- ఫిబ్రవరిలో వెలుగులోకి తెచ్చిన ఆంధ్రజ్యోతి
- సుమోటోగా లోకాయుక్త కేసు నమోదు
- బ్లాక్ లిస్టులో ఏడు స్వచ్ఛంద సంస్థలు!



సీజనల్ హాస్టల్‌లో విచారణ చేస్తున్న ఎస్ఎస్ఏ ఏపీసీ శ్రీనివాసులు

కర్నూలు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సీజనల్ హాస్టళ్ల పేరిట జరుగుతున్న దోపిడీ వాస్తవమే. పేద విద్యార్థుల కడుపులు కొడుతున్నారు. విద్యార్థులు హాజరు కాకపోయినా బోగస్ హాజరు చూపించి నిధులు స్వాహా చేస్తున్నారు. ఈ భాగోతాన్ని ఆంధ్రజ్యోతి ఫిబ్రవరి నెలలో వెలుగులోకి తెచ్చింది. ఏపీ లోకాయుక్త సుమోటోగా కేసు నమోదు చేసింది. జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆదేశాల మేరకు జిల్లా విద్యా అధికారి శ్యాముల్ పాల్, సర్వశిక్షా అభియాన్ (ఎస్ఎస్ఏ) ఏపీసీ శ్రీనివాసుల పర్యవేక్షణలో ఎంఈఓల నేతృత్వంలో మండల కమిటీలు వేసి విచారణ చేశారు. సీజనల్ హాస్టల్ నిర్వాహకులైన స్వచ్ఛంద సంస్థలు బోగస్ హాజరు చూపడమే కాకుండా హాజరైన విద్యార్థులకు సైతం మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాలు వడ్డించడం లేదని విచారణ అధికారులు నివేదికలు ఇచ్చారు. ఆ నివేదికల ఆధారంగా ఏడు స్వచ్ఛంద సంస్థలను బ్లాక్ లిస్టులో పెట్టినట్లు ఎస్ఎస్ఏ ఏపీసీ శ్రీనివాసులు తెలిపారు.

మిగతా 6వ పేజీలో

ఆస్తి పన్ను బకాయిలపై వడ్డీ మాఫీ గడువు పొడిగింపు

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ఆస్తి పన్ను బకాయిదారలుకు రాష్ట్ర ప్రభుత్వం మరో శుభవార్త తెలిపిందని నగర పాలక అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవి.కృష్ణ గురువారం తెలిపారు. ఆస్తి పన్నుపై 50 శాతం వడ్డీ మాఫీ పొందేందుకు ఏప్రిల్ 30 వరకు గడువు పొడిగించిందని ఆయన పేర్కొ న్నారు. వడ్డీపై మాఫి నూతన సంవత్సరం ప్రారంభ నెలలో సైతం వర్తింపచేయడం ఇదే మొదటిసారి అన్నా రు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబరు 66 జారీ చేసిందన్నారు. అయితే ఇప్పటికే నూతన సంవత్సర పన్నులకు ఏక మొత్తంలో చెల్లించే వారికి 5 శాతం రాయితీకి పన్నుదా రుల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. గడిచిన నాలుగు రోజుల్లో ఆస్తి పన్ను రూ.4.50 కోట్లు వసూలు అయిందన్నారు. అలాగే తాగునీటి కులాయి చార్జీలు రూ.50 లక్షలు వసూలు అయ్యాయని పేర్కొన్నారు. మిగిలిన బకాయి దారులు తక్షణమే తమ పన్నులను చెల్లించి బకాయిలపై 50 శాతం వడ్డీ రాయితీ, 2025-26 సంవత్సరం పన్నులపై 5 శాతం రాయితీ పొందాలని ఆయన పేర్కొన్నారు.

మెగా డీఎస్సీని వెంటనే విడుదల చేయాలి

డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ముట్టడి



స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌కు వినతి పత్రంఇస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

కర్నూలు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీని వెంటనే విడుదల చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కర్నూలు బిర్లా కాంపౌండు నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు భారీగా ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామన్న మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి హోదాలో మొదటి సంతకం పెట్టి డీఎస్సీ విడుదల చేయడంలో కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. పది నెలలు గడిచినా మొదటి సంతకాన్ని అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. మెగా డీఎస్సీని సీఎం చంద్రబాబు నాయుడు త్వరలోనే మెగా డీఎస్సీని విడుదల చేస్తామని తరచూ ప్రకటనలు చేస్తూ నిరుద్యోగులను మభ్యపెడుతున్నారని ఆరోపించారు. వెంటనే మెగా డీఎస్సీ విడుదల చేయాలంటూ జిల్లా మొత్తం అభ్యర్థులందరికీ ఒకే పేపరు ఉండేలా పరీక్షలు నిర్వహించాలన్నారు. ఈ ధర్నా కార్యక్రమంలో డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి శిరీష, జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర, జిల్లా ఉపాధ్యక్షులు అబ్దుల్లా, సహాయ కార్యదర్శి నిరుద్యోగుల నాయకులు చంద్రశేఖర్, వినయ్, జగన్మోహన్, 500 మంది డీఎస్సీ అభ్యర్థులు పాల్గొన్నారు.

21న మోడల్ స్కూల్స్ ప్రవేశ పరీక్ష

అమరావతి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మోడల్ స్కూల్స్‌లో ఆరో తరగతి ప్రవేశాలకు ఈ నెల 20న నిర్వహించదలచిన ప్రవేశ పరీక్షను 21వ తేదీకి మార్చినట్లు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ వి.విజయరామరాజు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 20న ఈస్టర్ పర్వదినం రావడంతో ఈ మేరకు మార్పు చేసినట్టు తెలిపారు.

16న జడ్పీ స్థాయి సంఘాల సమావేశాలు

కర్నూలు, న్యూసిటీ, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ స్థాయి సంఘాల సమావేశాలు ఈ నెల 16న నిర్వహించనున్నట్లు జడ్పీ సీఈఓ జి.నాసరరెడ్డి గురువారం తెలిపారు. జిల్లా పరిషత్‌లోని మినీ సమావేశభవనంలో ఏడు స్థాయి సంఘ సమావేశాలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారని తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు 2వ స్థాయి సంఘం, 11 గంటల నుంచి 12 గంటల వరకు 3వ స్థాయి సంఘం, 12 గంటల నుంచి ఒంటి గంట వరకు 6వ స్థాయి సంఘం సమావేశాలు జరుగుతాయి. అదేవిధంగా మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రెండు గంటల వరకు 4వస్థాయి సంఘం, 2:30 గంటల నుంచి 3:30 వరకు 5వ స్థాయి సంఘం, 3:30 నుంచి 5:30 వరకు 1, 7వ స్థాయి సంఘాల సమావేశాలు నిర్వహిస్తామని సీఈవో పేర్కొన్నారు. ఈ సమావేశా నికి సభ్యులందరూ హాజరు కావాలని కోరారు.

టీడీపీ కార్యకర్తలపై వైసీపీ నాయకుల దాడి
- చిన్నభూంపల్లి గ్రామంలో అర్థరాత్రి ఘటన
- ఇంటి గేటును ఢీకొట్టి.. భార్యాభర్తలపై దాడి
7

వన్యప్రాణుల కోసం..
సోలార్ ప్యానల్‌తో గుంతలకు నీరు పంపింగ్
నల్లమలో దాహం తీర్చుకుంటున్న అడవి జంతువులు
6

వన్య ప్రాణుల కోసం..

- సోలార్ ప్యానల్‌తో గుంతలకు నీరు పంపింగ్
- నల్లమలలో దాహం తీర్చుకుంటున్న అడవి జంతువులు


నల్లమలలో ఏర్పాటు చేసిన సోలార్ ప్యానల్

రుద్రవరం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : నల్లమలలోని రుద్రవరం రేంజ్‌లో సోలార్ విద్యుత్‌తో నీటి గుంతలకు నీరు సరఫరా చేస్తున్నారు. వేసవిలో వన్యప్రాణుల దాహం తీర్చడానికి అటవీశాఖ సోలార్ ప్యానల్ ఏర్పాటు చేసింది. అట్లాగే పీటీ, ఎంపీటీ ట్యాంకులను ఏర్పాటు చేసింది. వన్యప్రాణులకు దాహం తీరడంతోపాటు నీటి గుంతల చుట్టూ చెట్లు పచ్చబడతాయి. చెట్ల కింద గడ్డి పెరుగుతుంది. వన్యప్రాణులకు ఆకలి తీర్చేందుకు ఈ గడ్డి ఉపయోగపడుతుంది. వన్యప్రాణులు నీరు తాగడంతోపాటు శరీరాన్ని చల్లబరుచుకుంటాయి. పక్షులు కూడా దాహం తీర్చుకుంటున్నాయి.

సోలార్ ప్యానల్ ఏర్పాటు ఇలా

రుద్రవరం రేంజ్‌లో అహోబిలం, బీవీపెంట, న్నూతల, ఆలమూరు సెక్షన్ల పరిధిలో సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేశారు. చెలిమ రేంజ్‌లో రెండు ఏర్పాటు చేశారు. అట్లాగే రుద్రవరం రేంజ్‌లో సాసర్‌పీట్లు 29, చెలిమ రేంజ్‌లో 28 ఉన్నాయి. వీటికి ట్యాంకర్లతో నీరు సరఫరా చేసి నింపేవారు. ఈ సాసర్‌పీట్లలో నీరు సరిపోకపోవడంతో గుంతలు ఏర్పాటు చేశారు.

రుద్రవరం రేంజ్‌లో ఐదు చోట్ల సోలార్ ప్యానల్స్

రుద్రవరం రేంజ్‌లో అహోబిలం, న్నూతల, బీవీ పెంట, ఆలమూరు సెక్షన్లలో సోలార్ ప్యానల్స్ ఐదు చోట్ల ఏర్పాటు చేశాం. వీటిలో ఐసీఐసీ, ఫారెస్టుశాఖ ఆధ్వర్యంలో వీటిని ఏర్పాటు చేసి వన్యప్రాణుల దాహం తీర్చుతున్నాం.

-శ్రీపతినాయుడు, రేంజర్, రుద్రవరం రేంజ్

చెలిమ రేంజ్‌లో రెండు చోట్ల..

చెలిమరేంజ్‌లో రెండు చోట్ల నీటి గుంతలకు సోలార్ విద్యుత్‌తో నీరు సరఫరా చేస్తున్నాం. ఈ రేంజ్‌లో 28 సాసర్ పీట్లు ఉన్నాయి.

-ఉదయదీప్, ఇన్‌ఛార్జ్ రేంజర్, చెలిమ


నల్లమలలో నీటిగుంత వద్ద జింకలు


అడవిలో ఏర్పాటు చేసిన నీటి గుంతలు


బోరు నుంచి ఉబికి వస్తున్ననీరు

అన్నీ కాదు..ఒక్కటే..!


స్టాప్‌లాగ్ ఎలిమెంట్స్ ఏర్పాటు తర్వాత పూర్తిగా ఆగిపోయిన నీటి ప్రవాహం (ఫైల్)

(5వ పేజీ తరువాయి)

బోర్డు ఉన్నతాధికారుల నిర్లక్ష్యం కారణంగా వరద వచ్చే సమయానికి హడావుడిగా గేట్లు ఏర్పాటుకు సన్నాహాలు చేయడం విమర్శలకు తావిస్తోంది. జూన్ ఆఖరు వరకు గడువు ఇవ్వకుండా మే ఆఖరులోగా ఏర్పాటు చేస్తే.. జూన్‌లో వర్షాలు కురిసి వరద వచ్చినా ఎలాంటి ఇబ్బందులు ఉండవని, ఆ దిశగా బోర్డు ఇంజనీర్లు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని సాగునీటి నిపుణులు పేర్కొంటున్నారు.

మూడు రోజుల్లో నివేదిక

నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) నియమించిన సీడబ్ల్యూసీ మాజీ ఛైర్మన్ ఏకే బజాజ్ నేతృత్వంలోని నిపుణుల కమిటీ సూచన మేరకు మొత్తం 33 క్రస్ట్‌గేట్ల సామర్థ్యంలో టీబీపీ బోర్డు అధికారులు అధ్యయనం చేయించారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన చీరాల కేంద్రంగా పని చేస్తున్న కేఎస్ఎన్‌డీటీ సంస్థ క్రస్ట్‌గేట్ల నిపుణులు బృందం దాదాపు 20 రోజులు మొత్తం గేట్లను క్షుణంగా తనిఖీ చేశారు. డ్యాం నిర్మాణం సమయంలో క్రస్ట్‌గేట్ల డిజైన్ మేరకు తయారి సమయంలో పొడవు, వెడల్పు, మందం, బరువు ఉండేది..? ఆ తరువాత గేట్లలో వచ్చిన మార్పులు, వరద ఒత్తిడికి గేట్లు మందం ఏమైనా తగ్గిందా..? ఇలా పలు సాంకేతిక కోణాల్లో క్రస్ట్‌గేట్స్ హెల్త్ చెకప్ చేశారు. రెండు, మూడు రోజుల్లో బోర్డుకు నివేదిక ఇచ్చే అవకాశం ఉంది. ఆ నివేదిక రాగానే ఏపీ ప్రభుత్వం జలవనరులు సలహాదారుడు, క్రస్ట్‌గేట్ల నిపుణుడు కన్నయ్యనాయుడుతో చర్చించి మొత్తం గేట్ల ఏర్పాటుపై ఏపీ, కర్ణాటక ప్రభుత్వాలకు నివేదిక పంపేందుకు బోర్డు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

డ్యాం 19వ గేటు ఏర్పాటు చేస్తున్నాం

గత ఏడాది ఆగస్టులో కొట్టుకుపోయిన తుంగభద్ర డ్యాం 19వ గేటుకు ఏర్పాటు చేసిన స్టాప్‌లాగ్ ఎలిమెంట్స్ తొలగించి, ఆ స్థానంలో నూతన గేటు ఏర్పాటుకు దాదాపు రూ.2 కోట్లతో టెండర్లు పిలిచాం. జూన్ ఆఖరుగాలో గేటు ఏర్పాటు చేస్తాం. గేట్ల పరిస్థితి, సామర్థ్యాన్ని పరిశీలించిన కేఎస్ఎన్‌డీటీ సంస్థ నివేదిక ఇవ్వగానే క్రస్ట్‌గేట్ల నిపుణుడు కన్నయ్యనాయుడుతో చర్చించి మొత్తం గేట్ల ఏర్పాటుపై బోర్డు నిర్ణయం తీసుకుంటుంది.

- నారాయణనాయక్, తుంగభద్ర బోర్డు ఎస్ఈ (ఎఫ్ఏసీ), హోస్పెట్

ఏకకాలంలో దాడులు


లలిత కాటన్ మిల్‌లో తనిఖీలు

(5వ పేజీ తరువాయి)

అదేవిధంగా మరో ఇంటికి వెళ్తే.. ఆ ఇంటిని ఇతరులకు అద్దెకు ఇచ్చినట్లు తెలిసింది. మిగిలిన కాటన్ మిల్లులో అక్కడ ఉన్న సిబ్బంది నేతృత్వంలో పోలీసులు ముమ్మర తనిఖీ చేసి పలు డాక్యుమెంట్లు, బ్యాంకు అకౌంట్‌కు చెందిన పుస్తకాలు, ఆర్థిక లావాదేవీలకు సంబంధించి రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. దాదాపు పది గంటల పాటు పోలీసులు తనిఖీలు చేశారు. ఇదిలా ఉండగా బొగ్గారపు నాగరాజు, నాగప్రసాద్ మరో ఇద్దరు కూడా పథకం ప్రకారమే 15 రోజుల క్రితం నంద్యాల నుంచి వెళ్లినట్లు సమాచారం. ఇతర ప్రాంతాల్లో ఉంటూ ఇక్కడి వ్యవహారాలపై గుట్టుగా తెలుసుకుని తమ వ్యాపార లావాదేవీలు చూసుకుంటున్నట్లు తెలిసింది.

ఆర్థిక లావాదేవీల్లో విభేదాలు

బొగ్గారపు నాగరాజు, మను కలిసి 2010 నుంచి రియల్ ఎస్టేట్ రంగంతో పాటు ఇతరత్రా వ్యాపారాలు చేశారు. వీరిద్దరి మధ్య వందల రూ.కోట్లలో లావాదేవీలు జరిగాయి. రెండేళ్లుగా ఇరువురి మధ్య పలు రకాలుగా విభేదాలు రావడం.. ఆ తర్వాత ఫోర్జరీ, నకిలీ డాక్యుమెంట్లతో నాగరాజు కోర్టుకు వెళ్లడంతో విభేదాలు తార స్థాయికి చేరాయి. తనకు బెంగుళూరు చెందిన మను రూ.కోట్లలో అప్పు ఉన్నట్లు నాగరాజు కోర్టుకెళ్లారు. మరో వ్యాపారి మను వెంటనే అప్రమత్తమై కోర్టుకు వెళ్లి ఆ తర్వాత నంద్యాల త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. ఇదిలా ఉండగా ఇద్దరు రియల్ ఎస్టేట్ వ్యాపారులకు కీలక రాజకీయ నాయకులతో పరిచయం, అండదండలు ఉన్నాయి. అందుకే పోలీసులు కూడా ఆచితూచి దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.

రేపటి నుంచి ఫోరెన్సిక్ వైద్యుల సదస్సు

హాజరు కానున్న 380 మంది


బ్రోచర్లను విడుదల చేస్తున్న ఫోరెన్సిక్ మెడిసిన్ హెచ్‌వోడీ డా. సాయిసుధీర్, వైద్యులు

కర్నూలు హాస్పిటల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): 6వ రాష్ట్ర ఫోరెన్సిక్ మెడిసిన్ వైద్యుల సదస్సు ఈ నెల 12, 13 తేదీల్లో కర్నూలు మెడికల్ కాలేజీ న్యూలెక్చరర్ గ్యాలరీలో నిర్వహిస్తున్నట్లు ఫోరెన్సిక్ మెడిసిన్ హెచ్‌వోడీ, ఆర్గనైజింగ్ చైర్మన్ డా.టి. సాయిసుధీర్ వెల్లడించారు. గురువారం కర్నూలు మెడికల్ కాలేజీ ఫోరెన్సిక్ విభాగంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కర్నూలులో మొట్టమొదటిసారిగా ఫోరెన్సిక్ మెడిసిన్ వైద్యుల సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సదస్సుకు ఏపీ, తెలంగాణ, కర్ణాటక, కేరళ, తమిళనాడు నుంచి 380 మంది వైద్యులు హాజరవుతున్నారని తెలిపారు. ముఖ్య అతిథులుగా డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డా. నరసింహులు, డీఐజీ కోయ ప్రవీణ్, ఎస్పీ బిందుమాధవ్, ప్రిన్సిపాల్ డా. చిట్టినరసమ్మ, ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.కే. వెంకటేశ్వర్లు హాజరవుతున్నారని అన్నారు. ఈ సదస్సు థీమ్ క్లినికల్ ఫోరెన్సిక్ మెడిసిన్ ఎక్స్‌పర్ట్‌గా నిర్ణయించామని తెలిపారు. అనంతరం రాష్ట్ర సదస్సు బ్రోచర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ డా.పి. బ్రహ్మాజీ మాస్టర్, ఆర్గనైజింగ్ జాయింట్ సెక్రటరీ, కోశాధికారి డా.వైకేసీ రంగయ్య, సభ్యులు డా.కే. నాగార్జున, డా.వీ. కోటేశ్వరరావు, డా.పి. హరీష్ కుమార్, డా.వీ. సురేఖ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు పారితోషికం చెల్లించాలి: ఏపీటీఎఫ్

అమరావతి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): పదవ తరగతి పరీక్షా పత్రాల మూల్యాంకనంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, ఇతర సిబ్బందికి వెంటనే పారితోషికాలు చెల్లించాలని ఏపీటీఎఫ్-1938 అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.హృదయరాజు, ఎస్.చిరంజీవి కోరారు. గురువారం మంగళగిరిలోని విద్యాభవన్‌లో ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ కేవీ శ్రీనివాసులురెడ్డిని కలిసి ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. రూ.35 కోట్లు త్వరలో విడుదల చేస్తామని వారికి ఆయన హామీ ఇచ్చారు.

ఎన్‌ఈపీ అమలుకు స్టేట్ టాస్క్‌ఫోర్స్

అమరావతి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పాఠశాల విద్యాశాఖలో జాతీయ విద్యా విధానం అమలుకు పాఠశాల విద్యాశాఖ స్టేట్ టాస్క్‌ఫోర్స్‌ను నియమించింది. ఈ కమిటీకి పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ చైర్మన్‌గా ఉన్నారు. ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ ఎంవీ కృష్ణారెడ్డి మెంబర్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. ఆ శాఖ కమిషనర్ వి.విజయరామరాజు, సమగ్రశిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు, ఇతర అధికారులు సభ్యులుగా ఉన్నారు. రాష్ట్రంలో ఎన్‌ఈపీ అమలు ఎంతవరకు వచ్చింది? మొత్తం విధానం అమలుచేసేందుకు ఇంకా చేపట్టాల్సిన చర్యలపై ఈ కమిటీ కసరత్తు చేస్తుంది.

14న హెచ్‌డీఎస్ సమావేశం

- 19న వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ రాక
- కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు

కర్నూలు హాస్పిటల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో అభివృద్ధి సొసైటీ(హెచ్‌డీఎస్) సమావేశాన్ని ఈనెల 14వ తేదీ సోమవారం నిర్వహిస్తున్నట్లు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు వెల్లడించారు. ఈ సమావేశాన్ని 14వ తేదీ మధ్యాహ్నం 2:30 గంటలకు ధన్వంతరీ హాలులో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గురువారం తన చాంబర్‌లో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ డి.శ్రీరాములు, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ పి.సింధు సుబ్రహ్మణ్యం, ఏడీ మహేశ్వరమ్మతో కలిసి విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. కలెక్టర్ అధ్యక్షతన జరిగే హెచ్‌డీఎస్ సమావేశానికి పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, కోడుమూరు, పాణ్యం ఎమ్మెల్యేలు బొగ్గుల దస్తగిరి, గౌరు చరితారెడ్డి హాజరవుతారన్నారు. ఈ సమావేశంలో ఆసుపత్రి సమస్యలు, రోగుల ఇబ్బందులు పరిష్కరించే దిశగా ప్రణాళికలు రూపొందించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఈ నెల 19వ తేదీ శనివారం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ పూర్తి స్థాయి స్టేట్ క్యాన్సర్ హాస్పిటల్‌ను ప్రారంభించనున్నట్లు తెలిపారు. అదే రోజు కర్నూలు జీజీహెచ్‌ను ఆయన పరిశీలిస్తారని తెలిపారు.



హెచ్‌డీఎస్ నూతన కమిటీ

కర్నూలు జీజీహెచ్ ఆసుపత్రి అభివృద్ధి సొసైటీ (హెచ్‌డీఎస్)కు 16 మంది సభ్యులతో కమిటీ చైర్మన్ కలెక్టర్ పి.రంజిత్ బాషా ఏర్పాటు చేశారు. కమిటీలో కో చైర్మన్‌గా మంత్రి టీజీ భరత్, కన్వీనర్‌గా సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వర్లు, సభ్యులుగా పాణ్యం, కోడుమూరు ఎమ్మెల్యేలు బి.దస్తగిరి, గౌరు చరితారెడ్డి, అడ్మినిస్ట్రేటర్ పి.సింధు సుబ్రహ్మణ్యం, డీఎంఈ డీవీఎస్ఎల్ నరసింహం, బి.పద్మజ, ఏహెచ్ ప్రవీణ్ కుమార్, పి.రంగనాథరెడ్డి, బి.రామాంజనేయుల (ఆర్.కొంతలపాడు), పీటీ సాయిప్రదీప్, కర్నూలు మున్సిపల్ కమిషనర్ ఎస్.రవీంద్రబాబు, కేఎంసీ ప్రిన్సిపాల్ చిట్టినరసమ్మ, ఏపీఎంఎస్ఐడీసీ డీఈ కరీముల్లా, డీసీహెచ్ఎస్ కే.శ్రీనివాసులు, డీఎంహెచ్‌ఓ పి.శాంతికళ ఉంటారు.

బోగస్ హాజరుతో నిధులు నొక్కేశారు..!

(5వ పేజీ తరువాయి)

కర్నూలుకు పశ్చిమ ప్రాంతం అంటేనే గుర్తుకొచ్చేది కరువు, వలసలు. ఇక్కడి ప్రాంతాల్లో తల్లిదండ్రులతో పాటు విద్యార్థులు సైతం గుంటూరు, హైదరాబాద్ వంటి ప్రాంతాలకు వలసలు వెళ్తున్నారు. దీంతో చిన్నారుల చదువులు మధ్యలోనే ఆగిపోతున్నాయి. విద్యార్థులు వలసలు నివారించాలనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం మంత్రాలయం, ఆలూరు. కోడుమూరు, పత్తికొండ నియోజకవర్గాల్లో 34 సీజనల్ హాస్టళ్లు (కాలానుగుణ వసతి కేంద్రాలు) ఏర్పాటు చేశారు. నిర్వహణ బాధ్యతలు స్వచ్ఛంద సంస్థలు, గ్రామాల్లోని స్వయం సహాయక మహిళా పొదుపు సంఘాలకు అప్పగించారు. ప్రతి హాస్టల్‌లో 50 మంది విద్యార్థులకు భోజన వసతి కల్పించాలి. మధ్యాహ్న భోజనం పాఠశాలలో తింటే.. ఉదయం అల్పాహారం, రాత్రి భోజనం, సెలవు రోజుల్లో మధ్యాహ్నం కూడా భోజనం వడ్డించాలి. ప్రభుత్వం ఒక్కో విద్యార్థికి రూ.వెయ్యి, కేర్ టేకర్, ట్యూటర్, ఇద్దరు వంట మనుషులు రూ.30 వేలు జీతం చొప్పున ఒక్కో సీజనల్ హాస్టల్‌కు రూ.80 వేలు నిధులు ఇస్తుంది. 34 సీజనల్ హాస్టళ్లకు నెలకు రూ.27.20 లక్షలు ఖర్చు చేస్తోంది.

ఆంధ్రజ్యోతి తనిఖీలో వెలుగులోకి..

సీజనల్ హాస్టళ్లను నిబంధనల ప్రకారం నిర్వహిస్తున్నారా..? మెనూ ప్రకారం భోజనాలు వడ్డిస్తున్నారా..? విద్యార్థుల సేవలో ఏమేరకు తరిస్తున్నాయి..? సీజనల్ హాస్టళ్లను ఫిబ్రవరి 23న ఆంధ్రజ్యోతి ఆకస్మికంగా తనిఖీ చేస్తే అత్యంత దారుణమైన నిజాలు వెలుగు చూశాయి. మెజార్టీ హాస్టళ్లలో సగం కంటే తక్కువ విద్యార్థులే ఉన్నారు. వారికైనా రుచికరమైన భోజనం వడ్డించారా..? అంటే అదీలేదు. నీళ్ల చారు, ఉడికీఉడకని ముద్దన్నంతో సరిపుచ్చారు. కేర్ టేకర్, ట్యూటర్లు అందుబాటులో లేరు. సగం మంది విద్యార్థులు కూడా హాజరు కాకపోయినా 95 శాతం హాజరైనట్లు రికార్డులు చూపి నిధులు స్వాహా చేస్తున్నట్లు వెలుగు చూసింది. ఆంధ్రజ్యోతి కథనాన్ని సుమోటోగా తీసుకొని ఏపీ లోకాయుక్త కేసు నమోదు చేసింది. విచారణ చేసి నివేదిక ఇవ్వాలంటూ ఎస్ఎస్ఏ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది.

బ్లాక్ లిస్టులో ఏడు స్వచ్ఛంద సంస్థలు

క్షేత్రస్థాయిలో విచారించిన మండల విద్యాశాఖ అధికారులు, ప్రత్యేక అధికారులు ఇచ్చిన నివేదికల ఆధారంగా సీజన్ హాస్టళ్లు నిర్వహిస్తున్న ఏడు స్వచ్ఛంద సంస్థలను బ్లాక్ లిస్టులో పెట్టినట్లు ఏపీ సమగ్ర శిక్షా అభియాన్ (ఎస్ఎస్ఏ) అడిషినల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ శ్రీనివాసులు ఆంధ్రజ్యోతికి తెలిపారు.

- కోసిగి జడ్పీ హైస్కూల్ (బాలికలు)-1 (రూరల్ యాక్టివిటీ డెవలప్‌మెంట్ సంస్థ)
- కోసిగి జడ్పీ హైస్కూల్ (బాలికలు)-2 (రూరల్ అర్బన్ డెవలప్‌మెంట్ సొసైటీ)
- పత్తికొండ మండలం పందికోన ఎంపీపీఎస్-1 (సుకన్య విలేజ్ ఆర్గనైజింగ్)
- పత్తికొండ మండలం పందికోన-2 ఎంపీపీఎస్ (సుకన్య విలేజ్ ఆర్గనైజింగ్)
- ఆదోని మండలం పెద్దహరివాణం జడ్పీ హైస్కూల్ (శ్రీలక్ష్మి వెంకటేశ్వర స్వచ్ఛంద సంస్థ)
- ఆదోని మండలం పెద్దహరివాణం జడ్పీ హైస్కూల్ (గజిలింగేశ్వర స్వచ్ఛంద సంస్థ)
- క్రిష్ణగిరి మండలం కంబలపాడు జడ్పీ హైస్కూల్ (శారద పొదుపు సంఘం)

అదేవిధంగా పత్తికొండ మండలం దూదేకొండ ఎంపీపీ స్కూల్ సీజన్ హాస్టల్ నిర్వహిస్తున్న సంధ్య స్వచ్ఛంద సంస్థ, జూటూరు ఎంపీపీ స్కూల్ సంజీవకుమార్ స్వచ్ఛంద సంస్థ, తుగ్గలి మండలం జి.ఎర్రగుడి ఎంపీపీ స్కూల్ సీజనల్ హాస్టల్ నిర్వహించే మారుతి సంస్థలకు ఇచ్చే నిధుల్లో 20 శాతం కోత పెట్టారు. మంత్రాలయం మండలం రచ్చుమర్రి ఎంపీపీ స్కూల్‌లో సీజనల్ హాస్టల్ నిర్వహణ షర్మిల పొదుపు సంఘం, మాధవరం ఎంపీపీ స్కూల్‌లోని హాసల్ నిర్వహణ సంస్థ వీరన్నస్వామి పొదుపు సంఘాలకు 30 శాతం, కౌతాళం జడ్పీ ఉన్నత పాఠశాలలోని కీర్తి ఎడ్యుకేషనల్ రూరల్ డెవలప్‌మెంట్ సంస్థ, మంత్రాలయం మండలం బూదూరు గ్రామంలో సీజనల్ హాస్టల్ నిర్వహించే కలబందు కళాపరిషత్ స్వచ్ఛంద సంస్థకు 15 శాతం చొప్పున నిధుల్లో కోత పెట్టినట్లు వివరించారు. ఇవే తప్పులే పునారావృత్తమే ఆర్ఆర్ యాక్ట్ కింద రికవరీ చేస్తామని హెచ్చరించారు.

తెలంగాణ స్టేట్ ఆర్ట్ ప్రదర్శనలో కోటేష్ పెయింటింగ్


ఎంపికైన చిత్రం

నంద్యాల కల్చరల్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): నంద్యాలకు చెందిన ప్రముఖ చిత్రకారుడు చింతలపల్లె కోటేష్‌కు అరుదైన అవకాశం దక్కింది. తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో టార్చ్, కళాయజ్ఞం సంస్థలతో " శిలా నిశ్శబ్దం" పేరిట కాకతీయుల శిల్పకళా వైభోగం గురించి కాకతీయుల కట్టడాలపై పెయింటింగ్స్ వేయాలని తెలిపారు. "శిలా నిశ్శబ్దం" పేరిట నిర్వహించే ఈ కార్యక్రమానికి ఏపీ, తెలంగాణ రెండు రాష్ట్రాల నుండి 60 మంది చిత్రకారులు పాల్గొన్నారు. ఇందులో నంద్యాలకు చెందిన చిత్రకారుడు కోటేష్ వేసిన చిత్రానికి కూడా స్థానం దక్కింది. ఈనెల 12,13,14 మూడు రోజుల పాటు హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో వున్న స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ప్రదర్శనలో ఈ చిత్రాన్ని ప్రదర్శిస్తారు.


చిత్రాన్ని గీస్తున్న కోటేష్

ఏఎల్ఎస్‌సీవో పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల ఎడ్యుకేషన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా సమగ్ర శిక్షా కార్యాలయంలో ఖాళీగా ఉన్న ఆల్టర్నేటివ్ స్కూలింగ్ కోఆర్డినేటర్(ఏఎల్ఎస్‌సీవో) పోస్టుకు డిప్యుటేషన్ ప్రాతిపాదికన అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ఏపీసీ ప్రేమంత్‌కుమార్ తెలిపారు. ఏపీసీ మాట్లాడుతూ ఏఎల్ఎస్‌సీవో సెక్టోరియల్-1 పోస్టుకు డిప్యుటేషన్ ప్రాదిపతికన ఫారిన్ సర్వీస్ నియమ నిబంధనలను అనుసరించి జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్ పాఠశాలల్లో ఎనిమిదేళ్ల సర్వీసు కలిగి 2025 మార్చి 31 నాటికి 55ఏళ్లలోపు వయస్సు ఉన్న పాఠశాల సహాయకులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. పూర్తిచేసిన దరఖాస్తులను ఈనెల 10వతేదీ నుంచి 17వ తేదీ సాయంత్రం ఐదు గంటలలోపు జిల్లా సమగ్ర శిక్ష కార్యాలయంలో అందజేయాలని తెలిపారు.

ఆగ్రోస్ కళ..కళ..

- మళ్లీ రైతులతో సందడి
- వ్యవసాయ యాంత్రీకరణకు రూ.5.60 కోట్లు



ఆగ్రోస్ కార్యాలయం

కర్నూలు అగ్రికల్చర్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఆగ్రోస్ సంస్థకు కూటమి ప్రభుత్వం మళ్లీ జవసత్వాలు కల్పించింది. గతంలో ముఖ్యమంత్రులుగా పని చేసిన వైఎస్ రాజశేఖర్‌రెడ్డితో పాటు ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హయాంలో ఆగ్రోస్ సంస్థ ఒక వెలుగు వెలిగింది. రాష్ట్ర వ్యాప్తంగా రైతుల కోసం ఈ సంస్థ కార్యకలాపాలు కొనసాగించింది. రైతులకు యంత్ర పరికరాలు అందించడమే కాకుండా మార్క్‌ఫెడ్, ఆయిల్‌ఫెడ్ తదితర సంస్థల ద్వారా రైతుల నుంచి పంట ఉత్పత్తులను ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకు సేకరించి గోదాముల్లో నిల్వ చేసే కార్యక్రమానికి ఆ సంస్థ పెద్ద ఎత్తున చర్యలు చేపట్టింది. వైసీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే ఆగ్రోస్ నిర్వీర్యమై పోయింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఈ సంస్థకు సంబంధించిన ఆస్తులన్నీ కబ్జా చేసేందుకు ఆనాటి పాలకులు చేయని ప్రయత్నమంటూ లేదు. కర్నూలు నగరంలో రూ.100 కోట్లు విలువ చేసే ఆగ్రోస్ స్థలాన్ని ఏకంగా పార్టీ కార్యాలయానికి లీజుకు తీసుకుని ఏడాదికి ఎకరాకు కేవలం రూ.35 చెల్లించే విధంగా ఉత్తర్వులు జారీ చేశారు. నిత్యం రైతులతో కళకళలాడిన ఈ కార్యాలయం ప్రస్తుతం కల్లూరు ప్రాంతంలో మారుమూల పాడుబడిన ఓ గోదాములో కొనసాగేలా ఆనాటి పాలకులు తీసుకున్న చర్యలను రైతులను కడుపు మండేలా చేసింది. ఇక ఈ సంస్థ కనుమరుగవుతుందనే భయంతో ఉన్న అన్నదాతలకు కూటమి ప్రభుత్వం భరోసా ఇచ్చింది.

రూ .5.60 కోట్లతో రైతులకు యంత్ర పరికరాలు..

కళకళలాడుతున్న ఆగ్రోస్ కార్యాలయం

కూటమి ప్రభుత్వం ఆగ్రోస్ సంస్థను మళ్లీ బతికించాలనే లక్ష్యంతో పలు అభివృద్ధి కార్యక్రమాలను రైతుల కోసం ఈ సంస్థకు అధికారాలను ఇచ్చింది. కర్నూలు జిల్లాలో రూ.2.80 కోట్లు, నంద్యాల జిల్లాలో రూ.2.85 కోట్లుతో వ్యక్తిగతంగా అర్హులైన రైతులందరికీ పంటల సాగు కోసం పరికరాలను అందించేందుకు చర్యలు చేపట్టింది. రైతులకు వ్యక్తిగతంగా నాణ్యమైన వ్యవసాయ పరికరాలను అందించేందుకు వ్యవసాయ పరిశ్రమల అభివృద్ధి సంస్థ (ఆగ్రోస్) మళ్లీ సిద్ధమైంది. 2024-25 సంవత్సరానికి దాదాపు 3.500 మంది రైతులకు వ్యక్తిగత పరికరాలు, పనిముట్లు ఇవ్వాలని ఈ సంస్థ అధికారులు నిర్ణయించారు. ఇప్పటికే రైతు సేవా కేంద్రాల్లో రైతులు తమ పేర్లను నమోదు చేసుకుని సంస్థకు తమ వంతు మొత్తాన్ని ఆన్‌లైన్‌లోనే నేరుగా జమ చేయాలని వ్యవసాయ శాఖ యంత్రాంగం రైతులకు విజ్ఞప్తి చేయడం జరిగిందని ఉమ్మడి జిల్లా ఆగ్రోస్ మేనేజర్ వెంకటేశ్వరరెడ్డి విలేకరులకు తెలిపారు.

ఈ నెలలోనే పరికరాల పంపిణీ

రైతులకు యాంత్ర పరికరాల పంపిణీని ఈ నెలాఖరు లేదా, వచ్చే ఏడాది ఏప్రిల్ నెలలో పూర్తి చేసి రాబోయే ఖరీఫ్ సీజన్ నాటికి పంటల సాగుకు అవసరమైన పనిముట్లను అన్నదాతలకు అందించేలా ఆగ్రోస్ సంస్థ అధికారులు కార్యాచరణతో ముందుకు వెళ్తున్నారు. దాదాపు 3,500 మంది రైతులకు వ్యక్తిగతంగా పరికరాలు అందించేందుకు అవసరమైన ఏర్పాట్లు ఇప్పటికే పూర్తి చేశామన్నారు.



ఆకాశ వీధిలో..

కర్నూలు రూరల్, 10 (ఆంధ్రజ్యోతి): సూర్యుడు పూటకో రూపంలో దర్శనమిస్తూ ఔరా అనిపిస్తున్నాడు. ఉదయం బాలసూర్యప్రభాకలితంబై... మధ్యాహ్నం భగభగలాడుతూ రుద్రుడిలా... సాయంత్రాన భూమి, ఆకాశానికి సింధూర తిలకంలా త్రివిధ రూపాల్లో అందరినీ కట్టిపడేస్తున్నాడు. గురువారం సాయంత్రం 6 గంటల సమయంలో కర్నూలు నగర శివారులోని తుంగభద్ర తీరంలో సూరీడు సింధూర వర్ణంలో కనిపించగా, ఆకాశం నీలిరంగులో కనిపించింది. ఇదే సమయంలో తుంగభద్రమ్మ సైతం వయ్యారాలుపోతున్నట్లు, జలాలన్నీ సింధూర రంగులోకి మారిన అద్భుత దృశ్యాన్ని ఆంధ్రజ్యోతి తన కెమెరాలో బంధించింది.

ఫొటోలు : స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి, కర్నూలు.



సంధ్యావేళ.. చేపల వేటలో కొంగ



సింధూర వర్ణంలో తుంగభద్ర జలాలు

'జీవో నెంబరు 35తో అన్యాయం'

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పాలనా సంస్కరణల్లో భాగంగా ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబరు 35తో తమకు అన్యాయం జరుగుతుందని ఏపీ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం కర్నూలు జిల్లా అధ్యక్షుడు మురళీమోహన్ రెడ్డి అన్నారు. ఎంపీడీవో నేరుగా నియామక కోటాలు రద్దు చేసినందున తమ పదోన్నతికి ఇబ్బంది కలుగుతుందని చెప్పారు. నిష్పత్తి ప్రకారం పదోన్నతి ప్రక్రియ కొనసాగితే భవిష్యత్తులో పరిపాలన అధికారి స్థాయి నుంచి మండల పరిషత్ అభివృద్ధి అధికారి పదోన్నతి తీరని కలగా మిగులుతుందన్నారు. ఈ విషయంపై రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించి ఆమోద్య యోగ్యమైన నిర్ణయం తీసుకోవాలని కోరారు.

బంగారు నగలు, నగదు చోరీ

మహానంది, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.తిమ్మాపురం గ్రామంలోని భక్త శేషారెడ్డి ఇంటిలో దొంగలు చోరీ జరిగినట్లు ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి గురువారం తెలిపారు. భక్త శేషారెడ్డి కుటుంబ సభ్యులతో కలసి ఇంటికి తాళం వేసి అనంతపురం జిల్లా తాడిపత్రిలోని తన బంధువుల ఇంటికి ఉగాది పండుగకు వెళ్లారు. బుధవారం తిరిగి స్వగ్రామం చేరుకొని ఇంటి వద్దకు రాగానే తులుపులు పగలకొట్టి, బీరువా తెరచి ఉండటం గమనించిన ఇంటి యజమాని తన ఇంటిలో చోరి జరిగిందని నిర్ధారించుకొని పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. ఇంటి తలుపులు పగలకొట్టి బీరువాలోని రూ.2 లక్షల నగదుతో పాటు 5 తులాల బంగారు, వెండి వస్తువులను ఎత్తుకెళ్లారని చెప్పారు. గురువారం ఉదయం ఎస్ఐ ఆధ్వర్యంలో ఘటనా స్థలాన్ని పోలీసు సిబ్బంది పరిశీలించారు. ఇంటి యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మందుబాబుల దాడి.. వ్యక్తి మృతి

కర్నూలు క్రైం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని అరోరా నగర్ బీ.క్యాంపు క్వాటర్స్‌లో మందుబాబుల దాడిలో హరినాథ్ రెడ్డి (58) అనే వ్యక్తి మృతి చెందాడు. హరినాథ్ రెడ్డి ఇంటి పక్కనే ప్రభుత్వ క్వాటర్స్‌లో డేవిడ్ రాజు, రాహుల్, జితేంద్ర అనే వ్యక్తులు అనధికారికంగా నివాసముంటున్నారు. ఇటీవల ఈ ముగ్గురు మరి కొంత మంది స్నేహితులతో కలిసి మద్యం సేవిస్తూ అల్లరి సృష్టిస్తున్నారు. ఈ నెల 3వ తేదీన ఈ ముగ్గురు మద్యం తాగి అల్లరి చేస్తుండటంతో హరినాథరెడ్డి వారిని మందలించాడు. మద్యం మత్తులో ఉన్న ఆ ముగ్గురు హరినాథరెడ్డిపై దాడి చేసి గాయపరిచారు. బాధితుడు ఆసుపత్రిలో కోలుకోలేక గురువారం మృతి చెందాడు. బంధువుల ఫిర్యాదు మేరకు ముగ్గురు నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శేషయ్య తెలిపారు.

ఆస్తి విషయంలో తాతపై మనవడి దాడి

మిడుతూరు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): తాతపై మనవడు దాడి చేసిన ఘటన మండలంలోని చింతలపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలివీ.. చింతలపల్లి గ్రామానికి చెందిన మధు కుమార్ అను వ్యక్తి ఆస్తి విషయంలో అతడి తాత వడ్డె మద్దయ్యపై బుధవారం కర్రతో దాడి చేశాడు. ఈ దాడిలో మద్దయ్య ఎడమ కాలుకు తీవ్రగాయాలు అయ్యాయి. అయనను చికిత్స నిమిత్తం బంధువులు కర్నూలుకు తరలించారు. మద్దయ్య మనవరాళ్లు రేణుక, మహాలక్ష్మి ఫిర్యాదు మేరకు మధు కుమార్, అతడి భార్య మౌనిక, అత్త తులశమ్మపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఓబులేసు తెలిపారు.

వాహనం దగ్ధం

పత్తికొండ టౌన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో గురువారం తీవ్రమైన ఎండవేడిమి వల్ల విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయి ఒక మొబైల్ ఫ్రూట్ జ్యూస్ వాహనం దగ్ధమైంది. వివరాలివీ.. రాజస్థాన్‌కు చెందిన షోభాలాల్ అనే వ్యక్తి పట్టణంలో హోసూరు రోడ్డులో ఉన్న చేనేత కాలనీలో ఇంటిని అద్దె తీసుకుని నివాసం ఉంటున్నారు. ఆయన ప్రతిరోజు తన మొబైల్ వాహనంలో ఫ్రూట్ జ్యూస్ పట్టణంలో విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నారు. అయితే మూడు రోజులుగా ఇంటి దగ్గర లోనే పార్కింగ్ చేసుకున్నారు. అయితే గురువారం ఉదయం 11.30 గంటల తర్వాత ఎండవేడిమి తీవ్రతకు వాహనంలో మంటలు వ్యాపించాయి. గమనించిన కాలనీ వాసులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. వెంటనే అగ్నిమాపక సిబ్బంది చేరుకునే లోపే వాహనం పూర్తిగా మంటలకు దగ్ధమైంది. వాహనం అగ్నికి పూర్తిగా దెబ్బతినడంతో రూ.8 లక్షల దాకా నష్టం జరిగిందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు.



కాలిపోయిన వాహనం

శ్రేయా గ్రూప్ మోసంపై కొనసాగుతున్న విచారణ

కర్నూలు క్రైం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో లక్నోకు చెందిన శ్రేయా ఇన్‌ఫ్రా మార్కెటింగ్ అనే సంస్థ చేసిన మోసంపై విచారణ కొనసాగుతున్నది. ఈ సంస్థ కర్నూలు చెందిన కొంత మందితో భారీ ఎత్తున పెట్టుబడులు పెట్టించుకుని తిరిగి చెల్లించలేదనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో కర్నూలు చెందిన వెంకటసుబ్బారెడ్డి అనే వ్యక్తి గత ఏడాది నవంబరులో కోర్టును ఆశ్రయించగా.. కోర్టు ఆదేశాల మేరకు మూడో పట్టణ పోలీసులు గత ఏడాది నవంబరులో కేసు నమోదు చేశారు. గత ఐదు నెలలుగా సంస్థలో జరిగిన లావాదేవీలపై పోలీసులు విచారిస్తున్నారు. ఈ విషయంపై సీఐ శేషయ్యను వివరణ కోరగా.. తమకు ఫిర్యాదు ఇచ్చిన మాట వాస్తవమేనని, ఈ సంస్థలో జరిగిన మోసాలపై విచారిస్తున్నామన్నారు.

నేడు జ్యోతిరావు పూలే జయంతి

కర్నూలు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక కర్నూలు బిర్లాగేటు కూడలిలోని మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద జ్యోతిరావు పూలే జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహిస్తున్నట్లు బీసీ సంక్షేమ శాఖ సాధికారిత అధికారి ప్రసూన గురువారం తెలిపారు. జిల్లాలోని ప్రజాప్రతినిధులు, వివిధ బీసీ సంఘాల నాయకులు, అధికారులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

టీడీపీ కార్యకర్తలపై వైసీపీ నాయకుల దాడి

- చిన్నభూంపల్లి గ్రామంలో అర్ధరాత్రి ఘటన
- ఇంటి గేటును ఢీకొట్టి.. భార్యాభర్తలపై దాడి
- గాయపడిన వారిని ఆసుపత్రికి తరలింపు.. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు



గాయపడిన టీడీపీ కార్యకర్త లక్ష్మన్న, భార్య హైమావతి



అంబులెన్స్‌లో ఆసుపత్రికి..

కోసిగి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నభూంపల్లి గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త కొలిమి లక్ష్మన్న, హైమావతి దంపతులపై వైసీపీకి చెందిన గ్రామ సర్పంచ్ కే. చిన్నహుశేనీ తదితరులు బుధవారం అర్ధరాత్రి దాడి చేశారు. గ్రామానికి చెందిన గంగి హుశేనీ, కల్లూరు లక్ష్మయ్య, వుడితిని సోమిరెడ్డితో, సర్పంచ్ చిన్న హుసేనీ కలిసి లక్ష్మన్న, హైమావతి దంపతుల ఇంటి గేటును బైక్‌తో ఢీకొట్టి, ఇంట్లో నిద్రిస్తున్న కుటుంబ సభ్యులపై విచక్షణారహితంగా గూటాలతో దాడి చేశారు. వైసీపీ నాయకుల చేతుల్లో దెబ్బలు తింటున్న దంపతులను చుట్టుపక్కల వారు వచ్చి రక్షించారు. చిన్నభూంపల్లి గ్రామంలో సర్పంచ్‌పై ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినందుకే మనసులో పెట్టుకుని తమపై దాడి చేశారని బాధితులు తెలిపారు. తమ ఇంటి మీద వైసీపీ నాయకులు దాడి చేయడానికి తీసుకొచ్చిన బైక్‌ను అక్కడే వదిలి పారిపోయారని కోసిగి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కోసిగి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అనంతరం 108లో వారిని ఆదోని ఆసుపత్రికి తరలించారు. ఎస్ఐ హనుమంతరెడ్డిని వివరణ కోరగా.. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

కర్నూలులో టీడీపీ కార్యకర్తపై దాడి

కర్నూలు క్రైం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో కల్లూరు దర్వాజ వెళ్లే రహదారిలో టీడీపీ కార్యకర్త షేక్ ఇంతియాజ్ అనే వ్యక్తిపై దాడి జరిగింది. ఉస్తాద్ మహబూబ్ ఆలి అనుచరులు సమీర్, కలాంలు ఈ దాడి చేశారు. వైసీపీకి చెందిన ఉస్తాద్ మహబూబ్ ఆలి అనే వ్యక్తి అక్రమాలపై ఇంతియాజ్ రెండు మూడుసార్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నకిలీ పట్టాల కేసులో ఉస్తాద్ రిమాండ్‌కు కూడా వెళ్లాడు. ఇది మనసులో ఉంచుకున్న అతని అనుచరులు ఇంతియాజ్‌పై బుధవారం రాత్రి 11 గంటల ప్రాంతంలో దాడి చేసి గాయపరిచారు. ఆయనను ఆసుపత్రికి తరలించారు. గురువారం బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రామయ్య నాయుడు తెలిపారు.

వలస కూలీ ఆత్మహత్య

- అప్పుల బాధ తాళలేక గుంటూరులో పురుగు మందు తాగి బలవన్మరణం

గోనెగండ్ల, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక వలస వెళ్లిన చోటనే పురుగు మందు తాగి బైలుప్పల గ్రామానికి చెందిన తలారి చిన్న రంగన్న(41)ఆత్మహత్య చేసుకున్నాడు. గోనెగండ్ల మండలం బైలుప్పల గ్రామానికి చెందిన తలారి చిన్న రంగన్న తన భార్య, కుటుంబసభ్యులతో కలసి గత నెల మొదటి వారంలో గుంటూరు జిల్లా కట్ట చెరుకూరు మండలం చింతపల్లిపాడు గ్రామానికి బతుకు తెరువు కోసం వలస వెళ్లాడు. అక్కడ మిర్చి పని చేసే వారు. అయితే చిన్న రంగన్నకు స్వగ్రామం బైలుప్పలలో దాదాపు రూ. 15 లక్షల వరకు అప్పు ఉంది. అప్పులు తీర్చడం ఎలాగో తెలియక మనోవ్యథకు గురై గత నెల 31వ తేదిన రాత్రి ఇంట్లో అందరూ నిద్రిస్తున్న సమయంలో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలు ఆసుపత్రికి తీసుకు వచ్చారు. చికిత్స పొందుతూ గురువారం తెల్లవారు జామున చిన్న రంగన్న మృతి చెందాడు. భార్య రాములమ్మ గుంటూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. గురువారం బైలుప్పలలో దహనసంస్కారాలు చేసినట్లు బంధువులు తెలిపారు.

పూలే జయంతిని జయప్రదం చేయండి

- జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై.నాగేశ్వరరావు యాదవ్



మాట్లాడుతున్న వై.నాగేశ్వరరావు యాదవ్

కర్నూలు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని జయప్రదం చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.నాగేశ్వరరావు యాదవ్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కర్నూలులో బిర్లాగేటు సమీపంలోని మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద ఈ నెల 11వ తేదీ ఉదయం 10 గంటలకు నిర్వహించే జ్యోతిరావుపూలే జయంతిని జయప్రదం చేయడానికి అధిక సంఖ్యలో హాజరు కావాలన్నారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్నందున రాష్ట్ర కమిటి తరుపున సీఎం చంద్రబాబుకు వై.నాగేశ్వరరావు యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయీ బ్రాహ్మణ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ విజయకుమార్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి వేంపెంట రాంబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి పీజీ వెంకటేశ్, ఎం.మహేష్ యాదవ్, ప్రతాప్, శ్రీనివాసులు, భాస్కర్, శ్రీరాములు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం

- నంద్యాల డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహ యాదవ్

నంద్యాల రూరల్ 10 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీతోనే సామాజిక న్యాయం సాధ్యమని కాంగ్రెస్ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు జె.లక్ష్మీనరసింహ యాదవ్ అన్నారు. గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్‌లో జరిగిన ఏఐసీసీ ప్లీనరీ సమావేశానికి ఆయన ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి హాజరయ్యారు. ఈ సమావేశంలో పలు అంశాలపై తీర్మానం చేసినట్లు తెలిపారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో కరువు, ఉపాధి పనులు, వలసలు, సాగునీటి ప్రాజెక్టులను ఏఐసీసీ ముందుకు తీసుకెళ్లామన్నారు. ప్రజా సంక్షేమంపై కాంగ్రెస్ పార్టీకి నిబద్ధత ఉందన్నారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిని కలిసి పలు సమస్యలపై చర్చించామన్నారు. పార్టీ ఎల్లప్పుడు ప్రజలకు అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారన్నారు. కేంద్ర ప్రభుత్వ ఒత్తిడికి తలొగ్గే ప్రసక్తే లేదని చెప్పారు. ఇప్పటికైనా కేంద్ర,రాష్ట్రాల్లో ఎన్డీయే ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నేరవేర్చాలన్నారు. లేని పక్షంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామన్నారు. అదేవిధంగా కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకులను లక్ష్మీనరసింహయాదవ్ కలిశారు.



తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డితో లక్ష్మీనరసింహ యాదవ్

మెనూ ప్రకారం భోజనం వడ్డించాలి

నంద్యాల నూనెపల్లె, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ప్రభుత్వం సూచించిన విధంగా మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని ఏపీ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ ప్రతాప్‌రెడ్డి ఆదేశించారు. పట్టణంలోని క్రాంతినగర్‌లోని ఏపీ మోడల్‌స్కూల్‌ను గురువారం ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులకు వండిన భోజన నాణ్యతను పరిశీలించారు. దస్త్రాలను పరిశీలించారు. అనంతరం దేవనగర్‌లోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని తనిఖీ చేశారు. వసతి గృహాల్లో మెనూ విషయంలో వార్డెన్లు రాజీపడకూడదని సూచించారు. సివిల్ సప్లయిస్ ఇన్‌చార్జి డీఎస్‌వో రాజు, ఏఎస్‌వో రవిబాబు, డిప్యూటీ తహసీల్దార్ ప్రసాదరావు, లీగల్ మెట్రాలజీ, ఫుడ్ సేఫ్టీ అధికారులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఫుడ్ కమిషన్ చైర్మన్

కలెక్టర్‌ను కలిసిన చైర్మన్ : జిల్లా పర్యటనలో ఉన్న ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయప్రతాప్‌రెడ్డి గురువారం కలెక్టర్ రాజకుమారిని మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్‌ను కలిసి ఆయన పుష్పగుచ్ఛం అందించారు.

గుంటూరులో వలస కూలీ మృతి

నందవరం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముగతి గ్రామానికి చెందిన పీరమ్మ(32!) బతుకు తెరువు కోసం గుంటురుకు వలస వెళ్లి గురువారం అక్కడే మృతి చెందింది.. పీరమ్మ గురువారం కూడా మిరప పంట కోతకు వెళ్లింది. మధ్యాహ్నం వరకు బాగా పని చేసి, ఒంట్లో నలతగా ఉండి వడదెబ్బతో సొమ్మసిల్లి పడి పోయింది. తోటి కూలీలు వెంటనే గుంటురు ఆసుపత్రికి తరలించే మార్గ మధ్యంలో పీరమ్మ మృతి చెందింది. వెంటనే మృతదేహాన్ని ముగతి గ్రామానికి తీసుకువచ్చారు. మృతురాలికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

నంద్యాలలో విజిలెన్స్ దాడులు

- రేషన్ షాప్‌లు, హోటళ్లలో తనిఖీ
- 5 గృహ వినియోగ సిలిండర్లుసీజ్
- హోటళ్ల నిర్వాహకులపై కేసులు

నంద్యాల క్రైం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో గురువారం విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహిం చారు. పలు రేషన్ దుకాణాలతో పాటు హోటళ్లను కర్నూలు జిల్లా విజిలెన్స్ ఎస్పీ చౌడేశ్వరి ఆదేశాల మేరకు విజిలెన్స్ సీఐలు, ఎస్ఐల బృందం తనిఖీ చేసినట్లు తెలిపారు. పట్టణంలోని మూడు రేషన్ దుకాణాలను తనిఖీ చేసినట్లు వెల్లడించారు. జె.నాగన్న అనే డీలర్ నిర్వహిస్తున్న రేషన్‌షాప్‌లో 46చక్కెర ప్యాకెట్లు అధికంగా ఉన్నట్లు ఈపోస్ స్టాక్‌ను పరిశీలించగా బయటపడినట్లు తెలిపారు. ఈ మేరకు డీలర్ నాగన్నపై కేసు నమోదు చేయనున్నట్లు తెలిపారు. అలాగే పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని శ్రీలక్ష్మీశ్రీనివాస హోటల్, గ్రాండ్ ఫాస్ట్‌ఫుడ్, జావెద్‌హోటల్, గోల్డెన్ ఫుడ్ ప్లాజాలపై కూడా దాడిచేసినట్లు వెల్లడించారు. ఈ దాడుల్లో హోటళ్ల నిర్వాహకులు కమర్షియల్ గ్యాస్ సిలిండర్లను కాకుండా గృహ సంబంధిత గ్యాస్ సిలిండర్లను వాడుతున్నట్లు గుర్తించామని తెలిపారు. దీంతో 5గృహ సంబంధిత గ్యాస్ సిలిండర్లను పంచనామా నిర్వహించి సీజ్ చేసినట్లు వెల్లడించారు. సీజ్ చేసిన గ్యాస్ సిలిండర్లను సివిల్ సప్లయాస్ డిప్యూటీ తహసీల్దార్‌కు అప్పగించినట్లు తెలిపారు. ఈ మేరకు హోటళ్ల నిర్వాహకులపై కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. ఈ దాడుల్లో విజిలెన్స్ అధికారుల వెంట సివిల్ సప్లై అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



గ్యాస్ సిలిండర్లను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

కార్యకర్తలే టీడీపీకి పునాది

● మల్లెల రాజశేఖర్



హుశేనాపురంలో కార్యకర్తలకు సభ్యత్వ కార్డులు పంపిణీ చేస్తున్న మల్లెల రాజశేఖర్

ఓర్వకల్లు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే పునాదులు అని టీటీడీ బోర్డు సభ్యులు, నంద్యాల టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ అన్నారు. గురువారం మండలంలోని హుశేనాపురం గ్రామంలో టీడీపీ కార్యకర్తలకు సభ్యత్వ కార్డులను అందజేశారు. అనంతరం షాదీఖానా పనులను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అభివృద్ధి పథంలో దూసుకుపోతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు మహబూబ్‌బాషా, కేవీ మధు, కాటినేనినారాయణ, బజారు, జయకృష్ణ, గువ్వ రవికుమార్, ఖాదర్‌బాషా, అన్వర్‌బాషా, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే సమావేశం

ఓర్వకల్లు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ప్రభుత్వం రీసర్వే పేరుతో గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి రైతులతో మాట్లాడి వారి సమస్యల పరిష్కారానికే సమావేశం నిర్వహించడం జరిగిందని డిప్యూటీ కలెక్టర్, నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు విలేజ్ సర్వేయర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వీఆర్వోలు, విలేజ్ సర్వేయర్లు గ్రామాల్లో రీసర్వేలో ఎదుర్కొంటున్న సమస్యలు వాటి పరిష్కార మార్గాలపై వారు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలోతహసీల్దార్ విద్యాసాగర్, వీఆర్వోలు, విలేజ్ సర్వేయర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించండి

ఓర్వకల్లు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంఈవో ఓంకార్ యాదవ్ సూచించారు. గురువారం మండలంలోని పూడిచెర్ల, కేతవరం పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీలో బాగంగా రికార్డులను, మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి రుచి చూడడం జరిగింది. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

క్రీడలతో విద్యార్థులకు మంచి భవిష్యత్తు



బ్లాక్‌బెల్టులను సాధించిన క్రీడాకారులను అభినందిస్తున్న డాక్టర్ బి.శంకర్‌శర్మ

కర్నూలు స్పోర్ట్స్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు వైద్యులు డా.బి.శంకర్‌శర్మ తెలిపారు. గురువారం ఇండోర్ స్టేడియంలో తైక్వాండో క్రీడాకారులకు శిక్షకుడు వెంకటేశ్ ఆధ్వర్యంలో బ్లాక్ బెల్టులు ప్రధానోత్సవ కార్యక్రమానికి డా.శంకర్‌శర్మ హాజరై క్రీడాకారులకు బెల్టులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు, తైక్వాండో శిక్షకుడు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

13న సీనియర్ బాలికల క్రికెట్ జట్టు ఎంపిక

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అధ్వర్యంలో జరిగే అంతర్ జిల్లా క్రికెట్ టోర్నమెంటులో పాల్గొనే అండర్-15, అండర్-19, అండర్-23తో పాటు సీనియర్ బాలికల క్రికెట్ జట్టు ఎంపిక 13న నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి దేవేందర్‌గౌడు బుధవారం తెలిపారు. ఉదయం 10 గంటలకు డీఎస్ఏ స్టేడియంలోని కర్నూలు క్రికెట్ అసోసియేషన్ నెట్స్‌లో ఎంపిక జరుగుతుందన్నారు.

13న జిల్లా స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు

కర్నూలు స్పోర్ట్స్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక బీ.క్యాంపు క్రీడా మైదానంలో 13న జిల్లా స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు, క్రీడాకారుల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా హ్యాండ్‌బాల్ సంఘం కార్యదర్శి పి.సువర్ణ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు 26, 27 తేదీల్లో సత్యసాయి జిల్లా కదిరిలో జరిగే 54వ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొనేవారు 13వ తేదీ ఉదయం 7 గంటలకు బీక్యాంపు చేరుకోవాలని తెలిపారు.

ప్రభుత్వ ఆస్తులపై బ్యానర్లు, పోస్టర్లు అతికిస్తే చర్యలు

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): నగరంలో కూడళ్ళు, డివైడర్లు, ప్రభుత్వ ఆస్తులపై పోస్టర్లు, బ్యానర్లు అతికిస్తే సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నగర పాలక కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు గురువారం హెచ్చరించారు. కూడళ్లపై, డివైడర్ల మధ్యలోని స్తంభాలపై, గోడలపై బ్యానర్లు, పోస్టర్లు అతికించడం వల్ల అవి నగర అందాన్ని చెడగొడతాయన్నారు. రాజకీయ పార్టీలు, మతపరమైన సంస్థలు, ఇతర ప్రైవేటు సంస్థలు నగర పాలక సంస్థకు సహకరించాలని ఆయన కోరారు.

ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్టు బృందం తనిఖీ

కర్నూలు హాస్పిటల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరంలోని బళ్లారి చౌరస్తా సమీపంలో ఉన్న ఓ నెట్‌వర్క్ హాస్పిటల్‌లో డా.ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్టు డేటా అనలటిక్స్ బృందం తనిఖీ నిర్వహించింది. గురువారం ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు డా.ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్టు జాయింట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (జేఈవో) డా.సునీల, నంద్యాల ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ డా.రూపేంద్రనాథ్, కర్నూలు జీజీహెచ్ పీడీయాట్రిక్ డా.శశికుమార్ ఈ ముగ్గురు త్రిసభ్య కమిటీ సభ్యులు అక్రమాలు, కేసుల అవకతవకలపై తనిఖీ చేశారు. కేషీట్లను పరిశీలించారు. శనివారం నంద్యాలలోని ఓ నెట్‌వర్క్ హాస్పిటల్‌ను కూడా జేఈవో డా.సునీల, కర్నూలు జిల్లా ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ డా.భాస్కర్ రెడ్డి తనిఖీలు నిర్వహించనున్నారు.

రీ సర్వేను సద్వినియోగం చేసుకోవాలి: కలెక్టర్



రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్

సి.బెళగల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): రైతులు రీ సర్వేను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ రంజిత్‌బాషా అన్నారు. సి.బెళగల్‌లో చేపట్టిన రీసర్వేను కలెక్టర్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ రైతులు భూసమస్యలు ఉంటే తహసీల్దార్‌తో సంప్రదించి భూమిని కొలుతలు వేయించుకోవాలన్నారు. అలాగే రైతులు భూ సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలన్నారు. సమస్యలను పెంచుకుని కోర్టుల చుట్టూ తిరగడం వల్ల రైతులే నష్టపోతారన్నారు. రీసర్వే చేసే సమయంలో రెవెన్యూ అధికారులు తప్పనిసరి రైతులకు సమాచారం అందజేయాలన్నారు. అధికారులు రైతుల సమస్యలను పరిష్కరించకుండా వేధిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కలెక్టర్ వెంట ఆర్డీవో సందీప్‌కుమార్, ఇన్‌చార్జి తహసీల్దార్ పురుషోత్తం, సర్వేయర్ నాగభూషణం ఉన్నారు.

విద్యార్థులకు మెనూ ప్రకారంగా భోజనం వడ్డించాలి

కస్తూర్బాపాఠశాలలో చదువుతున్న బాలికలకు అందజేసే భోజనం మెనూ ప్రకారంగా వడ్డించడం లేదని విద్యార్థినులు తెలిపితే సస్పెండు చేస్తామన్నారు. అనంతరం విద్యార్థినులతో మాట్లాడుతూ విద్యార్థులు చదవుతోపాటు క్రీడాలలో కూడా రాణించాలన్నారు. అనంతరం పాఠశాల స్టోరుమ్, డైనింగ్ అల్, పాఠశాలలో కంపౌండు, తాగునీరు ఇబ్బంది లేకుండా విద్యార్థినులకు అన్ని మౌలికవసతులు కల్పించాలన్నారు. పాఠశాలలో నిర్మిస్తున్న అదనపు గదుల నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. కలెక్టర్ ఆర్డీవో సందీప్‌కుమార్, ఇన్‌చార్జి తహసీల్దార్ పురుషోత్తం, ఎంపీడీవో రాణెమ్మ, అధికారులు ఉన్నారు.

జిల్లా అదనపు న్యాయాధికారులకు వీడ్కోలు



బదిలీపై వెళ్తున్న అదనపు జడ్జి జి. భూపాల్ రెడ్డిని సన్మానిస్తున్న సీనియర్ న్యాయవాదులు

కర్నూలు లీగల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కర్నూలులో ముగ్గురు అదనపు జిల్లా న్యాయాధికారులకు స్థానిక బార్ అసోసియేషన్ ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. బదిలీపై వెళ్తున్న మొదటి అదనపు జిల్లా జడ్జి జి.భూపాల్ రెడ్డి, ఆరవ అదనపు జిల్లా జడ్జి పి.పాండురంగారెడ్డిలకు స్థానిక బార్ అసోసియేషన్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమానికి జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.కబర్థి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జిల్లా ప్రధాన న్యాయాధికారి మాట్లాడుతూ గత మూడేళ్లుగా న్యాయమూర్తులుగా పని చేస్తూ న్యాయవాదులందరి అభిమానం ఇంత పెద్దఎత్తున జూనియర్, సీనియర్ న్యాయవాదులు హాజరై ఆత్మీయ వీడ్కోలు పలకడం విశేషమని అన్నారు. బదిలీపై వెళ్తున్న అదనపు జిల్లా జడ్జిలు జి.భూపాల్ రెడ్డి, పి. పాండురంగారెడ్డి మాట్లాడుతూ మూడేళ్ల తమ పదవీ కాలంలో కర్నూలు బార్ అసోసియేషన్ తమకు ఎంతగానో సహకరించిందని, దాని వల్లే తాము కక్షిదారులకు న్యాయాన్ని అందించగలిగామని తెలిపారు. కర్నూలు బార్ అసోసియేషన్‌కు రాష్ట్రంలోనే మంచి పేరు ఉందని, తాము ఇక్కడకు రాకముందే తెలుసు అని తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.హరినాథ చౌదరి, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు పాలూరి రవిగువేరా, ప్రధాన కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు, అదనపు జిల్లా న్యాయాధికారులు టి.లీలావతి, ఈ.రాజేంద్రబాబు, లక్ష్మీరాజ్యం, సీనియర్ సివిల్ న్యాయాధికారి టి.మల్లీశ్వరి, న్యాయవాదులు తదితరులు హాజరై బదిలీపై వెళ్తున్న వారిని ఘనంగా సన్మానించారు.

ఘనంగా 'ప్రపంచ హోమియోపతి' దినోత్సవం



న్యాయవాదులకు హోమియో మందులను అందిస్తున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి జి. కబర్థి

కర్నూలు లీగల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కర్నూలు బార్ అసోసియేషన్ కార్యాలయంలో దయాల్బాగ్ రాధాస్వామి సేవా కమిటీ ఆధ్వర్యంలో ప్రపంచ హోమియోపతి దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కర్నూలు జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.కబర్థి మాట్లాడుతూ హోమియో వైద్యం అన్ని వ్యాధులకు ఉత్తమంగా పని చేస్తుందని తెలిపారు. హోమియో వైద్యుడు భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ ఎండాకాలంలో వడదెబ్బ తగలకుండా తాము ఉచితంగా హోమియో మందులను అందజేస్తున్నామని, పెద్ద సంఖ్యలో న్యాయవాదులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడం పట్ల సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిలా న్యాయ సేవాధికార సంస్థ బి.లీలా వెంకట శేషాద్రి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.హరినాథ చౌదరి, ఎన్జీవో గంగాధర్ రెడ్డి, పెద్ద సంఖ్యలో న్యాయవాదులు, న్యాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

జగన్‌రెడ్డి అసత్య ప్రచారాలను మానుకోవాలి

● కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు



సమావేశంలో మాట్లాడుతున్న కర్నూలు ఎంపీ నాగరాజు

కర్నూలు రూరల్ ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా రాప్తాడు పర్యటనలో తనకు సరైన భద్రత కల్పించడం లేదని జగన్‌రెడ్డి కూటమి ప్రభుత్వంపై నిందలు వేయడం సిగ్గుచేటని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు పేర్కొన్నారు. కర్నూలు ఎంపీ నాగరాజు తన కార్యలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ నేరపూరితమైన ఆలోచనలు కలిగిన జగన్‌కు ప్రజలు ప్రతిపక్షహోదా కూడా ఇవ్వలేదని అయినప్పటికీ ఆయనకు ఇంకా బుద్ధి రాలేదని విమర్శించారు. సంతాపం తెలపడానికి వెళ్లిన వ్యక్తి రోడ్లవెంబడి జనాన్ని రప్పించుకొని పోలీసుల వైఫల్యం అంటు మాట్లాడటం సరికాదన్నారు. పైగా తన ప్రభుత్వం వస్తే పోలీసులను బట్టలు ఊడగొట్టిస్తానంటూ జగన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యాలను ఎంపీ తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యంలో పోలీసులే లేకపోతే వ్యవస్థ ఏవిధంగా ఉంటుందో ఆలోచించుకోవాలని సూచించారు.

అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ కోసం రండి..

కర్నూలు అర్బన్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని 14న టౌన్ మోడల్ కళాశాలలో ఏర్పాటు చేసిన విగ్రహావిష్కరణకు ఎంపీ బస్తిపాటి నాగరాజును ఆహ్వానించారు. గురువారం ఎంపీని వారి నివాసంలో విద్యాశాఖ ఈఈ నాగరాజుతో కలిసి ప్రిన్సిపాల్ సుంకన్న ఆహ్వానం పలికారు. అనంతరం కళాశాలలోని పలు అంశాలపై ప్రిన్సిపాల్‌తో ఎంపీ చర్చించారు.

నూతన ఆలయంలో పూజలు



పూజలు చేస్తున్న టీజీ వెంకటేశ్ దంపతులు

కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సంకల్‌బాగ్‌లో తుంగభద్ర నదీ తీరంలో భక్తుల కోసం నూతనంగా నిర్మిస్తున్న సీతారాముల దేవాలయంలో గురువారం రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్, టీజీ రాజ్యలక్ష్మి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో మహా గణపతి పూజలతో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి వారు శ్రీకారం చుట్టారు. గురువారం నుంచి మూడు రోజుల పాటు ప్రత్యేక పూజాది కార్యక్రమాలు, హోమాలు నిర్వహిస్తారు. 12న విగ్రహ ప్రతిష్ఠ, ప్రాణ ప్రతిష్ఠ, యంత్ర ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వేద పండితులు తెలిపారు. వరుసగా మూడు రోజుల పాటు జరిగే ఈ పూజలు 12న పూర్ణాహుతి కార్యక్రమంతో ముగుస్తాయని తెలిపారు.

శతాబ్ది బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయండి

- పేట శ్రీరామాలయం ఛైర్మన్ చిలుకూరు ప్రభాకర్



వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న దేవాలయం నిర్వాహక ప్రతినిధులు

కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పాతనగరంలోని 200 ఏళ్లనాటి పేట శ్రీరామాలయంలో 12 నుంచి 18 వరకు నిర్వహిస్తున్న శతాబ్ది సప్తరాత్రోత్సవ బ్రహ్మోత్సవాలను భక్తులందరూ విజయవంతం చేయాలని ఆలయ అభివృద్ధి సమితి ఛైర్మన్ చిలుకూరు ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. గురువారం ఆలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో బ్రహ్మోత్సవాల వివరాలు తెలియజేసే కరపత్రాలు విడుదల చేశారు. 12న హనుమజ్జయంతి రోజున ప్రారంభిస్తున్నామని, అదేరోజు పవమాన హోమం, స్వామికి హనుమద్వాహన సేవ, 13న ఉదయం ధన్వంతరి హోమం, సాయంత్రం గజ వాహన సేవ, 14న నరసింహ హోమం, సాయంత్రం శేష వాహన సేవ, 15న సుదర్శన హోమం, సాయంత్రం గరుడవాహన సేవ, 16న సీతారాముల కల్యాణోత్సవం, సాయంత్రం రథోత్సవం కన్నుల పండువగా జరుగుతాయని తెలిపారు. 17న గోపాలకృష్ణ హోమం, సాయంత్రం అశ్వ వాహనసేవ, 18న మహాలక్ష్మి హోమం, సాయంత్రం హంస వాహన సేవలు ఉంటాయని తెలిపారు. సమావేశంలో ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు చిల్కూరు నందకిషోర్, ఎస్ ప్రాణేశ్, మాళిగి వ్యాసరాజ్, నాగోజీరావు, విఠల్‌రావు, మాళిగి భానుప్రకాశ్, చంద్రకాంత్, నరహరి, నీలి నరసింహ, దేవెళ్ల సాయినాథ శర్మ, సునీల్, ఈపూరి నాగరాజు, ఉపేంద్ర నాయక్ పాల్గొన్నారు.


చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు



శరీన్‌నగర్‌లో ప్రజలతో మాట్లాడుతున్న సీఐ మధుసూదన్‌గౌడు

కర్నూలు క్రైం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని సీఐ మధుసూదన్‌గౌడు హెచ్చరించారు. గురువారం నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని శరీన్‌నగర్‌లో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మధుసూదన్‌గౌడు సీసీ కెమెరాలు వాటి వల్ల కలిగే ప్రయోజనాలు, సైబర్ నేరాలకు గురి కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. యువత గంజాయి, డ్రగ్స్ వంటి వాటి జోలికి వెళ్లి తమ జీవితాలు నాశనం చేసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ కే.గోపీనాథ్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

ఎస్జీటీలకు అవకాశం కల్పించాలి



డీఈవోకు వినతి పత్రం ఇస్తున్న ఎస్‌జీటీఎఫ్ నాయకులు

కర్నూలు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పండిట్ పదోన్నతుల్లో అర్హత కలిగిన ఎస్జీటీలకు అవకాశం కల్పించాలని జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్‌కు ఎస్‌జీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పూజారి లక్ష్మయ్య, ఎల్లప్ప గురువారం వినతి పత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ ఎంఏ తెలుగు, బీఏ తెలుగు, హిందీ థర్డ్ మెథడాలజీ, అర్హత కలిగిన ఎస్‌జీటీలకు ఉమ్మడి సీనియారిటీ ద్వారా పదోన్నతి కల్పించాలన్నారు. ఫీడర్ కేటగిరీలో ఉన్న అర్హత కలిగిన పండిట్లు ఇతర సబ్జెక్టులకు క్రాస్ ప్రమోషన్‌కు వెళ్లినప్పుడు అన్ని అర్హతలు కలిగిన ఎస్జీటీలకు ఎందుకు పదోన్నతులకు అవకావం కల్పించకూడదో అని ప్రశ్నించారు. గతంలో బలవంతంగ ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంల నుంచి స్కూల్ అసిస్టెంట్లుగా వెళ్లిన వారికి ఇతర సబ్జెక్టు టీచర్లకు కూడా సబ్జెక్టు కన్వర్షెన్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరినట్లు వారు డీఈవోను కోరారు. డీఈవోకు వినతి పత్రం సమర్పించిన వారిలో వేణుఓపాల్, నాగేశ్వరరావు, శివకుమార్, మాదన్న, ఆమోస్, నాగరాజు, తిక్కన్న తదితరులు ఉన్నారు.

తాగునీటి పథకాల పరిశీలన

సి. బెళగల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంగాల. తిమ్మనదొడ్డి, గుండ్రేవుల గ్రామము పక్కన ఉన్న తుంగభద్రనదిలో నీటిని గురువారం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గోనెనాయక్ పరిశీలించారు. ఏఈ మాట్లాడుతూ వేసవిని దృష్టిలో పెట్టుకుని గ్రామాల్లో తాగునీటి సమస్య రానివ్వకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కార్యదర్శులకు సూచించారు. చెడిపోయిన చేతిపంపులను, విద్యుత్ మోటార్లకు మరమ్మతులు చేయించాలన్నారు.

పారిశ్రామికవేత్తలుగా ఎదగండి

● మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ నాగశివలీల



మాట్లాడుతున్న మెప్మా పీడీ నాగశివలీల

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మహిళలు ప్రతి కుటుంబం నుంచి ఒక్కరు పారిశ్రామికవేత్తగా ఎదగాలని మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ నాగశివలీల అన్నారు. గురువారం ఎస్‌బీఐ కాలనీలోని నూతన కౌన్సిల్ హాలులో 2025.2026 ఆర్థిక సంవత్సరానికి మెప్మా కార్యక్రమాలపై కర్నూలు, గూడూరుకు సంబంధించి రిసోర్స్ పర్సన్లకు ఒక్కరోజు వర్క్‌షాపు నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ ఇచ్చిన లక్ష్యాలను నిర్ధేశించిన ప్రకారం పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో టీపీఆర్‌ఓ వెంకటలక్ష్మి, సిటీ మిషన్ మేనేజర్ విజయభాస్కర్‌రెడ్డి, టీఈలు, టీఎంసీలు సుధాకర్, భారతి, వీరారెడ్డి, ఆర్‌పీలు పాల్గొన్నారు.

మురుగు కాలవల్లో వ్యర్థాలు వస్తే చర్యలు

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): నగరంలోని మురుగు కాలువల్లో మురుగునీరు కాకుండా వ్యర్థాలు వస్తే చర్యలు తప్పవని నగర పాలక ప్రజారోగ్య అధికారి డా.కే. విశ్వేశ్వరరెడ్డి అన్నారు. గురువారం నగరంలోని హోటల్ నిర్వాహకులకు నోటీసులు జారీ చేశారు. ఆయన మాట్లాడుతూ బంగారుపేటలోని ఓ హోటల్ నిర్వాహకులు గత కొంతకాలంగా వ్యర్థాలను మురుగు కాలువల్లో వేస్తున్నట్లు ఫిర్యాదులు వచ్చాయన్నారు. నగర ప్రజలు, హోటల్ రెస్టారెంట్లు, మాంసపు దుకాణదారులు, ఇతరత్రా అన్ని వాణిజ్య సముదాయాల దుకాణాదారులు దీనిని గ్రహించి నగర పాలకకు సహకరించాలని ఆయన అన్నారు.

సీఐటీయూ వర్క్‌షాపును జయప్రదం చేయండి

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ఈనెల 12,13 తేదీలలో జరిగే సీఐటీయూ రాష్ట్రస్థాయి వర్క్‌షాపును జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శివర్గసభ్యుడు కే. ప్రభాకర్ పిలుపునిచ్చారు. గురువారం కేకే భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్యకర్తలను చైతన్యవంతం చేయడానికే రాష్ట్ర నాయకత్వం వివిధ ప్రాంతాల్లో వర్క్‌షాపులను నిర్వహిస్తుందన్నారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ అధ్యక్షుడు వలి, నాయకులు నబి, పెద్ద కరుణ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

రైతు సంఘం ఆవిర్భావ దినాన్ని జయప్రదం చేయండి



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి కే.జగన్నాథం

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ఏపీ రైతు సంఘం 90వ ఆవిర్భావ దినోత్సవాన్ని జయప్రదం చేయాలని సంఘం రాష్ట్ర కార్యదర్శి కే. జగన్నాథం పిలుపునిచ్చారు. గురువారం సీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమిళనాడు రాష్ట్రం నాగపట్నంలో అఖిల భారత రైతు సంఘం జాతీయ మహసభలు ఈ నెల 15,1617 తేదీలలో నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా ఆవిర్భావ దినోత్సవాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి వంపన్నగౌడు, సీపీఐ నగర కార్యదర్శి పి.రామక్రిష్ణారెడ్డి, సహయ కార్యదర్శి సి.మహేష్, రాజేష్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

బీసీ కాలనీలో తాగునీటి సమస్యను పరిష్కరించాలి

గూడూరు, ఏప్రిల్ 10: (ఆంధ్రజ్యోతి): గూడూరు నగర పంచాయతీ పరిధిలోని తూర్పు బీసీ కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని మాజీ జడ్పీటీసీ ఎల్ వెంకటేశ్వర్లు కోరారు. గురువారం ఆయన మాట్లాడుతూ కాలనీకి నీటి సరఫరా చేసే మోటారు పని చేయక పోవడంతో నీటి సమస్య తలెత్తిందన్నారు. అధికారులు స్పందించి నీటి సమస్యను పరిష్కరించాలని కోరారు.

న్యాయవాది మృతికి సంతాపం

కర్నూలు లీగల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కర్నూలు బార్ అసోసియేషన్ సభ్యులు జి. వెంకటేశ్వర్లు మృతి పట్ల కర్నూలు బార్ అసోసియేషన్ తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేసింది. వెంకటేశ్వర్లు 1994 నుంచి కర్నూలులో న్యాయవాద వృత్తిలో ఉంటూ ఇటీవలే అనారోగ్యానికి గురై తిరుపతిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. ఆయన భౌతికకాయానికి బార్ అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి.హరినాథ చౌదరి, వెంకటేశ్వర్లు పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

నేటి నుంచి సుంకులా పరమేశ్వరి అమ్మవారి బ్రహ్మోత్సవాలు



గూడూరు, ఏప్రిల్ 10: (ఆంధ్రజ్యోతి): కె నాగలాపురం సుంకులాపరమేశ్వరి అమ్మవారి బ్రహ్మోత్సవాలు శుక్రవారం నుంచి 13వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి బి.వి.నరసయ్య తెలిపారు. 11న గణపతి, పుణ్యహావాచనం, కంకణధారణ, అంకురార్పణ, మండపరాధన, రాత్రి 8గంటలకు ప్రభోత్సవం, 12న నిత్యపూజలు, రథాంగ హోమము, శిఖర పూజలు, సాయంత్రం 5గంటలకు దివ్యమంగళ రథోత్సవము, 13న నిత్యపూజలు, మండపారాధన, ఉద్వాసన, సాయంత్రం 4గంటలకు లింగమన్న పూజ కార్యక్రమాలను నిర్వహిస్తామని ఈవో తెలిపారు. అలాగే అమ్మవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు.

కర్నూలు డిపో ఎదుట ఎన్ఎంయూ ధర్నా

కర్నూలు రూరల్ ఏప్రీల్ 10(ఆంధ్రజ్యోతి): స్థానిక కొత్తబస్టాండ్ ఆవరణలో ఉన్న కర్నూలు 1,2డిపోల ఎదుట గురువారం ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు ధర్నా చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు ఎన్ఆర్ నాయుడు అధ్యక్షత వహించగా ముఖ్యఅతిగా రాష్ట్ర కార్యదర్శి పీఎండి ఇస్మాయిల్ పాల్గొని ప్రసంగించారు. ఉద్యోగులకు ఉద్యోగభ ద్రత కల్పించి అక్రమ సస్పెషన్లను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వర్కింగ్ ప్రసిడెంట్ పీఏ వళి, రీజనల్ నాయకులు రంగన్న, మద్దయ్య, డిపో కార్యదర్శులు ఇసాక్, యంఎస్‌రెడ్డి, రవీంద్ర, తిమ్మప్ప పాల్గొన్నారు.

సర్వేపల్లిలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



పాఠశాలలో విద్యార్థులతో పాఠశాల డైరెక్టర్ పి. శేషన్న

కర్నూలు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక కృష్ణానగర్‌లోని సర్వేపల్లి పాఠశాలలో గురువారం ప్రీ ప్రైమరీ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల డైరెక్టర్ పి.శేషన్న ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పాఠశాల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పి. దీక్షిత్ మాట్లాడుతూ సర్వేపల్లిలో చదివే విద్యార్థులందరూ జీవితంలో గొప్ప స్థాయికి చేరుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కేపీ అరుణ, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలను గుర్తిస్తున్నాం

మద్దికెర, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ స్థలాలను గుర్తిస్తున్నామని తహసీల్దార్ హుశేన్ సాహెబ్ తెలిపారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ సిబ్బంది ద్వారా పరిశీలిస్తున్నామని, నూతనంగా నిర్మించిన ప్రభుత్వ కార్యాలయాలకు కేటాయించిన భూముల వివరాలతో నివేదికలు సిద్ధం చేయాలన్నారు. అలాగే పెరవలి గ్రామంలో ఈ నెల 15వ తేదీలోపు వందశాతం సర్వే పూర్తయ్యేలా కృషి చేస్తున్నామన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి హెల్ప్‌లైన్



• ఆర్డీవో భరత్ నాయక్

పత్తికొండ టౌన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ డివిజన్ పరిధిలోని గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తితే హెల్ప్‌లైన్ నెంబర్ 8520796952కు ఫోన్ చేయాలని ఆర్డీవో భరత్ నాయక్ సూచించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వేసవిలో తాగునీటి సమస్యలు వస్తాయని ప్రజలు ఉదయం 8 నుంచి సాయంత్రం 7.30 గంటల్లోపు ఫోన్ చేస్తే సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ముఖ్యంగా పత్తికొండ రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఆలూరు, ఆస్పరి, చిప్పగిరి, దేవనకొండ, హాలహర్వి, క్రిష్ణగిరి, మద్దికెర, పత్తికొండ, తుగ్గలి మండలాల గ్రామాల్లో నీటి సమస్య వస్తే తక్షణమే పరిష్కరిస్తామని ఆర్డీవో తెలిపారు.

శవ రాజకీయాలు మానుకోవాలి



విలేకరులతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

తుగ్గలి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత వైఎస్ జగన్ శవ రాజకీయాలు మానుకోవాలని టీడీపీ పట్టణ అధ్యక్షుడు లక్ష్మణస్వామి, బీసీ సంఘం నాయకులు సంగాల కృష్ణ అన్నారు. గురువారం జొన్నగిరిలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జగన్ ప్రజలను రెచ్చగొట్టేలా మాట్లాడుతున్నారని, పోలీసులపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. హోటల్ మల్లికార్జున, జయరాం, నాగరాజు, తదితరులు ఉన్నారు.

సీనియార్టీ జాబితాలో తప్పులు లేకుండా చూడాలి



డీఈవోకు వినతిపత్రం ఇస్తున్న ఎస్టీయూ నాయకులు

ఆదోని అగ్రికల్చర్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సీనియార్టీ జాబితాలో తప్పులు లేకుండా చూడాలని ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగరాజు కోరారు. గురువారం మునిసిపల్ పాఠశాలకు వచ్చిన డీఈవో శామ్యూల్ పాల్‌కు వినతిపత్రం అందజేశారు. తాత్కాలిక సీనియార్టీ జాబితాను సవరించాలని కోరామన్నారు. పురపాలక పరిధిలో అప్‌గ్రేడ్ అయిన ఉన్నత పాఠశాలలకు పోస్టులు మంజూరు చేయాలని కోరారు. ఇందకు డీఈవో సానుకూలంగా స్పందించినట్టు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు వీరచంద్ర యాదవ్, రమేష్ నాయుడు, రవి, భీమరాజు, ఉరకుందప్ప, లోక్యా నాయక్, సుధాకర్ పాల్గొన్నారు.

టీడీపీతో కార్యకర్తలకు భరోసా



సభ్యత్వ కార్డులను అందజేస్తున్న టీడీపీ నాయకులు

మద్దికెర, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీతో కార్యకర్తలకు భవిష్యత్తు, భరోసా ఉంటుందని ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పెరవలి రామాంజనేయులు అన్నారు. గురువారం మద్దికెర గ్రామంలో సభ్యత్వాల కార్డులను పంపిణీ చేశారు. సభ్యత్వం ఉన్నవారికి రూ.5 లక్షల బీమా ఉందన్నారు. సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. ఎమ్మెల్యే శ్యాంబాబు ఆధ్వర్యంలో పార్టీని బలోపేతం చేస్తామన్నారు. పంచాయతీ సభ్యుడు జమేదార్ జంబునాథ్ రాయుడు, పట్టణ టీడీపీ అధ్యక్షుడు గడ్డం రామాంజులు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు పారా విఠోబ, మీసేవా భీమరాజు, గొడుగు సతీష్ కుమార్, గొల్లాపూర్ చంద్ర ఉన్నారు.

రేపటి నుంచి జాతర

మద్దికెర, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.అగ్రహారం గ్రామం ఫక్కీరప్ప స్వామి జాతర 12వ తేదీ నుంచి 15వ తేదీ వరకు ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. 12న ప్రత్యేక పూజలు, సాయంత్రం ఊరేగింపు అలాగే 13న మహా మంగళ హారతి, మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం రథోత్సవం, సాంస్కృతిక కార్యక్రమాలు, 14వ తేదీ పారువేట, ఎద్దుల రాతిదూలం పోటీలు ఉంటాయని తెలిపారు.

9 మందిపై కేసు నమోదు

దేవనకొండ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కరిడికొండ వద్ద ఈనెల 5న జరిగిన ఘర్షణలో 9 మంది పై కేసు నమోదు చేసినట్లు సీఐ వంశీనాథ్ గురువారం తెలిపారు. కరిడికొండ గుట్టల్లో మట్టి తరలింపులో ఇరు వర్గాలు దాడి చేసుకొని ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశామన్నారు.

అంబేడ్కర్ జయంతి నిర్వహిద్దాం



మాట్లాడుతున్న ఎంఈఎఫ్ అధ్యక్షుడు ప్రదీప్ కుమార్

ఆలూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఈనెల 14న రాజ్యాంగ నిర్మాత అబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించాని ఎమ్మార్పీఎస్ మాదిగ ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షుడు ప్రదీప్ కుమార్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ఇండోర్ స్టేడియంలో బసవరాజు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు.

తరగతి లేక..



హెబ్బటం జడ్పీ ఉన్నత పాఠశాలలో తరగతి గది దుస్థితి

హొళగుంద, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హెబ్బటం జడ్పీ ఉన్నత పాఠశాలలో 700మంది విద్యార్థులు అభ్యసిస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం నాడు- నేడు కింద నూతనంగా 12 తరగతి గదుల నిర్మాణాన్ని రూ.2.15కోట్లతో నిర్మించేందుకు ప్రారంభించింది. అయితే నిధులు ఇవ్వకపోవడంతో పనులు ఆగిపోయాయి. కాసోకూస్తో ఒక్క గది మాత్రమే అణువుగా ఉండటంతో 78మంది ఆరోగతి విద్యార్థులు నేలపైనే కూర్చుని చదువుకుంటున్నారు. మిగతా తరగతులు విద్యార్థులు పాత గదుల్లోనే చదువుకుంటున్నారు. సౌకర్యాలు లేకపోవడంతో విద్యార్థులు ఉపాధ్యాయులు అవస్థలు పడుతున్నారు.

సర్వే ఉద్యోగుల సేవలు ప్రశంసనీయం



ఉద్యోగికి కేక్ తినిపిస్తున్న సబ్ కలెక్టర్ భరద్వాజ్

• సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఆదోని, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): సర్వే ఉద్యోగుల సేవలు ప్రశంసనీయమని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అన్నారు. గురువారం జాతీయ సర్వే దినోత్సవ వేడుకలు కార్యాలయంలో నిర్వహించారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ సర్వే ఉద్యోగుల సేవలు అమూల్యమైనవని అన్నారు. తహసీల్దార్ శివరాముడు, డీటీలు గుండాల నాయక్, పెద్దయ్య, డిప్యూటీ ఇనెస్పెక్టర్ ఆఫ్ సర్వేయర్స్ శ్రీ వేణుసూర్య, మండల సర్వేయర్ ఈశ్వర, గ్రామ సర్వేయర్లు, అధికారులు పాల్గొన్నారు.

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

దేవనకొండ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పోరాటాలతోనే ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయని సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్ అన్నారు. గురువారం దేవనకొండలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కార్పొరేట్ ప్రపంచంలో పేదల బతుకు భారమైందన్నారు. రైతు, కార్మిక వ్యతిరేక విధానాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాటాలు చేసాత్మన్నారు. పార్టీ నిర్మాణం, భవిష్యత్ కార్యాచరణపై కార్యకర్తలకు అవగాహన కల్పించారు. నాయకులు వీరశేఖర్, అశోక్, బజారి, శ్రీనివాసులు, సుధాకర్, బలరాముడు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో పల్లెకు పోదాం



చర్చిస్తున్న బూత్ కమిటీ సభ్యులు

ఆదోని టౌన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ఆధ్వర్యంలో పల్లెకు పోదాం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. మండలంలోని సలకలకొండ, బసరకోడు గ్రామాల్లో ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ఎమ్మెల్యే పార్థసారధి ఆదేశాల మేరకు నిర్వహించినట్లు ఓబీసీ మోర్చా కో కన్వీనర్ మునిస్వామి తెలిపారు. బూత్ కమిటీ సభ్యులతో చర్చించారు. బూత్ కమిటీ అధ్యక్షుడు ఉచ్చీరప్ప, సభ్యులు ఈరన్న, జీయం ఈరన్న, రామాంజి, నల్లన్న, దేవి రెడ్డి, నాగేష్, దేవేంద్ర, గోపాల్ పాల్గొన్నారు.

జగన్‌పై కేసు నమోదు చేయాలి



ఫిర్యాదు చేస్తున్న ఈదుల వెంకటరాముడు

వెల్దుర్తి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పోలీసుల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై కేసు నమోదు చేయాలని రైతుసంఘం నాయకుడు ఈదుల వెంకటరాముడు కోరారు. గురువారం వెల్దుర్తి పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్ రాముడుకు ఫిర్యాదు అందజేశారు. అధికారులను కించపరుస్తూ మాట్లాడడం తగదన్నారు.

వేధింపుల నుంచి కాపాడండి



తహసీల్దార్‌కు యజమానుల వినతిపత్రం

దేవనకొండ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పీడీఎఫ్, యూట్యూబ్ విలేకర్ల వేధింపుల నుంచి కాపాడాలని దేవనకొండలోని ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్ల యజమానులు కోరారు. ఈ మేరకు గురువారం తహసీల్దార్ ప్రసాదు రాజుకు వినతిపత్రం ఇచ్చారు. మండలంలో కొందరు పీడీఎఫ్, యూ ట్యూబ్ విలేకర్లమం టూ వాహనాలను అపుతూ బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కన్నప్ప, రామిరెడ్డి, కె వెంకటేష్, ఉరుకుందు, బడేసాహెబ్, రహిమాన్, జాకీర్, ఖాసిం పాల్గొన్నారు.

టీడీపీతో రాష్ట్రాభివృద్ధి



సభ్యత్వ కార్డులతో నాయకులు

తుగ్గలి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం ప్రభుత్వంతో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని, ఆ పార్టీ నాయకుడు దేవదాసుగౌడ్, హెచ్ఎన్ఎస్ ఎస్ నీటి సంఘం అధ్యక్షుడు రామాంజ నేయులు అన్నారు. గురువారం నునుసు రాళ్లలో టీడీపీ సభ్యత్వ కార్డులను అంద జేశారు. సభత్యం ఉంటే రూ.5లక్షల బీమా వర్తిస్తుందని, కార్యకర్తల కష్టసుఖాల్లో పార్టీ అండగా ఉంటుందన్నారు. మహేష్‌గౌడు, కార్యకర్తలు పాల్గొన్నారు

21న ప్రవేశ పరీక్ష

ఆలూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు 21న ప్రవేశపరీక్ష ఉంటుందని ప్రిన్సిపాల్ రాఘవరావ్ గురువారం తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశానికి ఈనెల 20న జరగాల్సిన పరీక్షను ఈస్టర్ పండుగ కారణంగా 21న ఉదయం 10 గంటల నుంచి 12 వరకు నిర్వహిస్తామని విద్యార్థులు, తల్లిదండ్రులు మార్పును గమనించాలని ప్రిన్సిపాల్ సూచించారు.

జగన్‌ను కలిసిన నాయకులు

మద్దికెర, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డిని మండల వైసీపీ అధ్యక్షుడు టీ.మల్లికార్జున యాదవ్ కలిశారు. గురువారం అమరావతిలోని వైసీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే కే.శ్రీదేవితో పాటు కలిసారు. మండలంలో పార్టీని బలోపేతం చేస్తామని, కార్యకర్తలు ఐకమత్యంతో ముందుకు వెళ్తామని తెలిపారు.

తుగ్గలి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డిని తుగ్గలి నాయకుడు హనుమంతు, జడ్పీటీసీ పులికొండ నాయక్, మండల అధ్యక్షుడు అట్ల గోపాల్ రెడ్డి కలిశారు.

భూసార పరీక్షలు చేయించుకోవాలి

మద్దికెర, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులు భూసార పరీక్షలు చేయించుకోవాలని ఏవో రవి గురువారం తెలిపారు. పరీక్షలు చేయించు కుంటే భూముల్లో సూక్ష్మమూలకాల వివరాలు తెలుస్తాయన్నారు. దీన్ని బట్టి ఎరువులు వాడాలని, రసాయన ఎరువులు అధికంగా వాడితే భూములు నిస్సారమవుతాయని తెలిపారు. ఏఈవో భోజరాజు, వ్యవసాయ సిబ్బంది జాకీర్, ఆనంద్, వాణి, కవిత, తదితరులు ఉన్నారు.

సారా బట్టీలపై దాడులు

తుగ్గలి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి):సారా, బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు పత్తికొండ ఎక్సైజ్ సీఐ విశ్వేశ్వరరావు తెలిపారు. గురువారం బాటతాండా శివారులోని బట్టీలపై దాడులు చేశామన్నారు. ఇద్దరిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు పంపామన్నారు.

బోయినపల్లిలో 'పల్లెకు పోదాం'

వెల్దుర్తి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): పౌష్టికాహార పక్షోత్సవాలలో భాగంగా గురువారం 'పల్లెకు పోదాం' నిర్వహించారు. బోయినపల్లి అంగన్‌వాడీ సెంటర్-1, సెంటర్-2లో కార్యవర్గ సభ్యుడు కొలంకి రామస్వామి, నారాయణ, నాగేశ్వ రరావు గర్భిణులకు సీమంతం చేశారు. కేంద్ర ప్రభుత్వ సేవలను తెలిపారు. రామళ్లకోట సచివాలయంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి అవగాహన కల్పించారు.

కౌన్సిలర్లు లేని సమావేశం



బోసిపోయిన కౌన్సిల్ హాల్

• వైసీపీ కౌన్సిలర్ల గైర్హాజరు

ఆదోని టౌన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కౌన్సిల్ సమావేశానికి కౌన్సిర్లు గైర్హాజరు కావడంతో సమావేశం బోసిపోయింది. గురువారం చైర్‌పర్సన్ శాంత అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం నిర్వహించారు. అయితే టీడీపీకి చెందిన పార్వతి, ఇటీవల బీజేపీకి మద్దతు పలికిన వైసీపీ కౌన్సిలర్లు సురేష్, వసీం, చిన్న మాత్రమే హాజరయ్యారు. గంటపాటు వేచి చూసినా సభ్యులు రాకపోవడంతో సమావేశానికి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించి చైర్‌పర్సన్ శాంత వెళ్లిపోయారు.

నిజాయితీకి నజరానా : చైర్‌పర్సన్

తన నిజాయితీకి నజరానాగా అవిశ్వాస తీర్మానం ప్రతిపాదించారని చైర్‌పర్సన్ శాంత ఆవేదన వ్యక్తం చేశారు. తన ఛాంబర్‌లో ఆమె విలేఖరులతో మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కారాన్ని పక్కకు పెట్టి, తనను పదవి నుంచి దించడమే ధ్యేయంగా వైసీపీ కౌన్సిలర్లు వ్యవహరిస్తున్నారని విమర్శిస్తున్నారని అన్నారు. అవిశ్వాస తీర్మానాన్ని ఎదుర్కొంటానని, రాజీనామా చేసి ఓటమిని అంగీకరించేది లేదని శాంత అన్నారు.

నీటి తొట్లు.. చెత్తపాలు

• నిర్వహణ మరిచిన అధికారులు



తహసీల్దార్ కార్యాలయం వద్ద చెత్తతో నిండిన నీటితొట్టి

మద్దికెర, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో మూగ జీవాల దాహార్తి తీర్చేందుకు 2017లో ఉపాధి నిధులతో నీటితొట్లను నిర్మించారు. ఇందుకు ఒక్కో తొట్టి నిర్మాణానికి రూ.25వేలు ఖర్చు చేశారు. మండలంలో 8 పంచాయతీల్లో 14 తొట్లను నిర్మించారు. కొంతకాలం నీటితో నింపిన పంచాయతీ సిబ్బంది అనంతరం వాటిని పట్టించు కోవడం మానేశారు. దీంతో ఇవి చెత్తకుండిలా మారాయి.

• ఈ విషయమై ఈవోఆర్డీ మద్దిలేటి స్వామి మాట్లాడుతూ తొట్ల నిర్వహణను పంచాయతీలకు అప్పగించామని వారే చూసుకోవాలని తెలిపారు.

విద్యుత్ బస్సులను ఆర్టీసీ ద్వారానే నడపాలి



ఆందోళన చేస్తున్న ఆర్టీసీ కార్మికులు

ఆదోని అగ్రికల్చర్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ బస్సులను ఆర్టీసీ ద్వారానే నడపాలని ఎన్ఎంయూ డిపో అధ్యక్షుడు ఆరోగ్యప్ప అన్నారు. గురువారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నాయకులు ఆందోళన చేశారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన సర్క్యులర్ నెం.1/2019ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈహెచ్ఎస్ రద్దుచేసి పాత వైద్య విధానాన్ని కొనసాగించాలని కోరారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను సంస్థ ద్వారానే జీతాలు చెల్లించాలన్నారు. విశ్రాంత ఆర్టీసీ ఉద్యోగులకు సూపర్ లగ్జరీ బస్సుల్లో ఉచిత ప్రయాణాన్ని అనుమతించాలని కోరారు. సెక్రెటరీ హరిబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ బసవరాజు, కోశాధికారి రామలిం గప్ప, షరాఫ్, బాలకృష్ణ, వీరేష్, నాగరాజు, చాంద్ బాషా పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలపై గళమెత్తండి



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆదోని అగ్రికల్చర్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ సమస్యలపై అసెంబ్లీలో గళమెత్తాలని ఎస్టీయూ అకడమిక్ కమిటీ సభ్యుడు మహదేవప్ప, జిల్లా కార్యదర్శి గోపాల్ కోరారు. గురువారం ఎమ్మెల్యే పార్థసారథికి వినతిపత్రం అందజేశారు. 11వ పీఆర్సీ గడువు ముగిసినా ఇంతవరకు 12వ పీఆర్సీని ప్రకటించకపోవడంతో ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారన్నారు. 30శాతం ఐఆర్‌ను ప్రకటించాలని, రూ.20వేల కోట్లకు బకాయిలు ఉన్నాయని తెలిపారు. సుంకన్న, రామాంజినేయులు, రామకృష్ణ, సుధాకర్ బాబు, సూర్యుడు, ఆంజనేయ, రామాంజినేయులు పాల్గొన్నారు.

రైల్వే లైన్ భూ సేకరణను నిలిపివేయాలి



ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న దౌల్తాపురం రైతులు

పత్తికొండ, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): డబుల్ లైన్ రైల్వే పనులకు చేపట్టనున్న భూసేకరణ ప్రక్రియను నిలిపివేయాలని చిప్పగిరి మండలం దౌల్తాపురం రైతులు ఆర్డీవో భరత్ నాయక్‌ను కోరారు. గురువా రం ఆర్డీవోకు వినతి పత్రం సమర్పించారు. గుంతకల్లు మున్సిపాలిటీ సమీపంలో ఉన్న తమ పొలాల్లో వాణిజ్య పంటలు సాగుచేస్తూ, జీవిస్తు న్నామని పొలాలు పోతే తమకు జీవనాధారం కష్టమవుతుందన్నారు. డబుల్ లైన్ ఏర్పాటుకు సమీప ప్రాంతంలో రైల్వే భూములు ఉన్నాయని వాటిలో రైల్వే లైన్ ఏర్పాటు చేయాలని కోరారు.

పెంచిన గ్యాస్, పెట్రోల్ ధరలు తగ్గించాలి : వైసీపీ

మద్దికెర, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పెంచిన పెట్రోల్, డీజిల్ వంట గ్యాస్ ధరలను తగ్గించాలని వైసీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు రేలంపాడు వెంకటేశ్వర్లు, మండల వైసీపీ ఉపాధ్యక్షుడు కృష్ణా యాదవ్ అన్నారు. గురువారం మద్దికెరలో మాట్లాడుతూ వంట గ్యాస్ ధరను ఏకంగా రూ.50 పెంచడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు.

ఘనంగా వైకుంఠం మల్లికార్జున జన్మదిన వేడుకలు



మల్లికార్జున చౌదరికి కేక్ తినిపిస్తున్న దేవేంద్రప్ప

ఆలూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ వైసీపీ సీనియర్ నాయకుడు వైకుంఠం మల్లికార్జున చౌదరి జన్మదిన వేడుకలు ఆలూరులో నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు హాజరై కేక్‌కట్ చేశారు. కరార్యక్రమంలో జడ్పీటీసీ ఏరూర్ శేఖర్, మాజీ జడ్పీటీసీ దేవేంద్రప్ప, మాజీ ఎంపీపీ భీమ లింగప్ప, ఎమ్మెల్యే విరుపాక్షి సోదరుడు వెంకటేష్, ఎల్లంకి నారాయణ స్వామి, అనిల్, జహీర్, అమర్, కర్రెన్న, హరి, గౌతం పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపదను సృష్టిస్తాం

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

• పంచాయతీ కార్యదర్శి మహమ్మద్ రఫి



దేవనకొండ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): తడి, పొడి చెత్తను వేరు చేసి చెత్త నుంచి సంపదను సృష్టిస్తామని మేజర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి మహమ్మద్ రఫి తెలిపారు.

ప్రశ్న: పారిశుధ్య నిర్వహణ చర్యలను తెలపండి?

జవాబు: పంచాయతీలో 2,350 గృహాలు, 12,500కు పైగా జనాభా ఉండగా, 20కు పైగా కాలనీలు ఉన్నాయి. దాదాపు 21 మంది కాంట్రాక్టు సిబ్బందితో రోజూ పారిశుధ్య పనులు చేస్తున్నారు.

ప్రశ్న: మార్కెట్‌ను అభివృద్ధి చేశారా ?

జవాబు: నాబార్డు నిధులతో షెడ్లు, మరుగుదొడ్లని నిర్మిస్తాం. నాబార్డు నిధులు 90 శాతం 13.50 లక్షలు, గ్రామ పంచాయతీ 10శాతం వాటాగా మొత్తం రూ.1.50 లక్షలతో ప్రతిపాదనలు పంపాం. అనుమతులు రాగానే పనులు మొదలు పెడతాం.

ప్రశ్న: గృహ నిర్మాణల కోసం అనుమతులు ఏలా పొందాలి ?

జవాబు: ఐదు సెంట్లలోపు నిర్మాణాలకు గ్రామ పంచాయతీ, ఆపై కూడా (కర్నూలు డెవలప్‌మెంట్ అథారిటీ) అనుమతి తప్పనిసరి. గృహ నిర్మాణాలకు చదరపు అడుగుకు రూ.20, దుకాణాలకు రూ.40, ప్రభుత్వ నిర్దేశించిన రుసుములు చెల్లించాలి.

ప్రశ్న: చెత్త సేకరణ ఎలా చేస్తున్నారు?

జవాబు: చెత్త బండ్లతో తడి, పొడి చెత్తను సేకరించి సాలిడ్ వేస్ట్ ప్రాసెసింగ్ సెంటర్‌కు తరలిస్తాం. అనంతరం తడి చెత్తను వర్మికంపోస్టుగా మార్చి విక్రయిస్తాం. అలాగే ప్లాస్టిక్, సీసాలు, అట్టలు తదితర పొడి చెత్తను కూడా విక్రయించి పంచాయతీకి ఆదాయం సమకూరుస్తాం.

ప్రశ్న: తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నారా ?

జవాబు: గ్రామంలో 6 ఓవర్‌హెడ్ ట్యాంకులు, 2 భూగర్భ ట్యాంకు ఉన్నాయి. 6 బోరు బావుల ద్వారా, బండగట్టు తాగునీటి పథకం ద్వారా నీరు సరఫరా చేస్తున్నాం.

ప్రశ్న: ఇంటి పన్నులు వసూలు చేశారా?

జవాబు: 2024-25కు గృహాలకు రూ.14 లక్షలు, కుళాయిలకు రూ.6 లక్షలు కాగా వందశాతం లక్ష్యాన్ని సాధించాం.

పౌష్టికాహారం తీసుకోవాలి


కోసిగిలోని అంగన్‌వాడీ సెంటరు-9లో అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ కాత్యాయని, సిబ్బంది

కోసిగి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలు చిరుధాన్యాలతో కూడిన పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కాత్యాయని అన్నారు. గురువారం కోసిగిలోని 9, 11, 12, 18, 19 అంగన్‌వాడీ టీచర్లకు కోసిగిలోని 9వ సెంటర్‌లో పౌష్టికాహార పక్షోత్సవాలను నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, ఆకుకూరలు, కూరగాయలు, పాలు పండ్లు ఆహారంలో విరివిగా తీసుకోవాలన్నారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రంలో ఇచ్చే పౌష్టికాహారంతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని తెలిపారు.

మంత్రాలయం వంట ఏజెన్సీకి మెమో జారీ

మంత్రాలయం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం ఉన్నత పాఠశాలలో రుచికరమైన భోజనం వడ్డించడం లేదని ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయప్రతాప్ రెడ్డి తనిఖీలో బయట పడటంతో గురువారం వంట ఏజెన్సీ శిల్ప పొదుపు గ్రూపు సభ్యులకు మెమో జారీ చేసినట్లు ఎంఈవో రాగన్న తెలిపారు. విద్యార్థులకు తగ్గట్లు కందిపప్పు వేయకపోవడం గమనించిన ఫుడ్ కమిషన్ చైర్మన్ అధికారులకు నోటీసులు జారీ చేసి వారి నుంచి వివరణ తీసుకోవాలని ఆదేశించారు. ఆయన ఆదేశాల మేరకు నోటీసులు జారీ చేసి ప్రభుత్వ సొమ్మును నిర్వీర్యం అవుతుందని భావించి త్రిసభ్య కమిటీ విచారణ చేయాలని ఆదేశించారు. ఈ ఏజెన్సీని ఎందుకు తొలగించరాదో మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆదేశించారు.

ఆంజనేయస్వామికి విరాళం

పెద్దకడుబూరు, ఏప్రిల్10(ఆంధ్రజ్యోతి): పెద్దకడుబూరు గ్రామంలో పాతూరు కొండల్లో వెలసిన పాతూరు ఆంజ నేయస్వామి దేవాలయానికి కొటేకల్లుకు చెందిన పుల్లారెడ్డి అనే భక్తుడు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా భక్తుడు పుల్లారెడ్డిని ఆలయ నిర్వాహకులు ఆశీర్వదించారు.

డీజేలు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు: సీఐ

గోనెగండ్ల, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): పెళ్లి వేడుకలు, ఊరేగింపుల్లో డీజేలు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని గోనెగండ్ల సీఐ విజయభాస్కర్ హెచ్చరించారు. ఆయన మాట్లాడుతూ డీజే ఏర్పాట్లకు ఎట్టి పరిస్థితులలో అనుమతి ఇవ్వమన్నారు. అధిక శబ్దం వచ్చే మైక్, డెక్కులకు డీఎస్పీ ద్వారా అనుమతి తీసుకోవాలని సూచించారు. పోలీసుల అనుమతి లేకుండా డీజేలు ఏర్పాటు చేయొద్దన్నారు.

పౌష్టికాహార కిట్టు అందజేత

ఎమ్మిగనూరు రూరల్, ఏప్రిల్10(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సిరాలదొడ్డి గ్రామంలో బాలింత కుటుంబానికి అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సురేఖ గురువారం పౌష్టికాహార కిట్టను అందజేశారు. గురువారం 'ఆంధ్రజ్యోతి' 'ఆధార్ ఉంటేనే పౌష్టికాహారం' సొంత నిబంధనలు పెట్టిన అంగన్‌వాడీ కార్యకర్తలు అన్న శీర్షికతో కథనం ప్రచురితమైంది. స్పందించిన ఐసీడీఎస్ అధికారులు గ్రామానికి వెళ్లి విచారణ చేపట్టారు. అనంతరం బాలింత కుటుంబానికి పౌష్టికాహార కిట్టును అందజేశారు.

డివిజన్‌ను ప్రథమస్థానంలో నిలపాలి

- ఎల్ఐసీ బీఎం పుల్లి నాయక్


ఎల్ఐసీ కార్యాలయంలో పూజలో పాల్గొన్న సిబ్బంది

ఎమ్మిగనూరు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): కడప డివిజన్‌లో ఎమ్మిగనూరు ఎల్ఐసీ శాఖ జీవిత బీమా పాలసీల సేకరణలో ప్రథమస్థానంలో నిలిచేందుకు ప్రతి ఏజెంట్, డీవోలు కృషి చేయాలని ఎల్ఐజీ బ్రాంచి మేనేజరు పుల్లి నాయక్, ఏబీఎం సంతోష్ కుమార్ అన్నారు. గురువారం స్థానిక జీవిత బీమా సంస్థ కార్యాలయంలో 2025-26 నూతన ఆర్థిక ఏడాదికి పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతేడాది పాలసీల సేకరణలో ఎంతో ప్రగతి సాధించారని, అదేవిధంగా ఈ ఏడాదికూడా అత్యధికంగా పాలసీలు సేకరించి ఎమ్మిగనూరు బ్రాంచికి మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఏవో మహేష్ కుమార్, సీనియర్ బిజినెస్ అడ్వైజర్ పాటిల్ తిమ్మారెడ్డి, సిబ్బంది, అర్చకులు ఏజెంట్లు పాల్గొన్నారు.

క్రీడాకారిణికి చేయూత


విద్యార్థిని ముస్కాన్‌కు నగదు ఆర్థికసాయం అందజేస్తున్న ప్రదీప్ రెడ్డి

మంత్రాలయం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారిణి ముస్కాన్‌కు ఆయా పార్టీల నాయకులు చేయూతనిచ్చారు. మంత్రాలయం ఉన్నత పాఠశాల విద్యార్థి ముస్కాన్ (9వ తరగతి) జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైంది. ఈ నెల 22 నుంచి 31 వరకు మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనుంది. క్రీడాకారిణికి వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రదీప్ రెడ్డి రూ.10వేలు, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి రూ.5వేలు ఆర్థిక సాయం అందజేసినట్లు పాఠశాల హెచ్‌ఎం అంపయ్య, ఫిజికల్ డైరెక్టర్లు బసవరాజు, నరసింహరాజు తెలిపారు.

కళాశాల విద్యార్థులకు పుస్తకాల పంపిణీ


విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ప్రిన్సిపాల్ అధ్యాపకులు

మంత్రాలయం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు గురువారం ప్రిన్సిపాల్ రమేష్ ఆధ్వర్యంలో టెస్టు బుక్స్, నోట్‌బుక్స్‌ను అందజేశారు. కళాశాల ప్రాంగణంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర పథకం కింద విద్యార్థులకు ముందుగానే పంపిణీ చేయడంతో ఇంటర్‌లో మంచి మార్కులు సాధించేందుకు ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీనివాసులు, మద్దిలేటి, ప్రభాకర్, వెంకటస్వామి పాల్గొన్నారు.

బడి వయసు పిల్లలను బడిలో చేర్పించాలి

పెద్దకడుబూరు, ఏప్రిల్10(ఆంధ్రజ్యోతి): బడి వయసు పిల్లలను బడిలో చేర్పించాలని జిల్లా విద్యాధికారి శామ్యూల్‌పాల్ తెలిపారు. గురువారం మండలంలోని 26 గ్రామాల్లో ఉన్న 85 మంది బడీడు పిల్లలను బడిలో చేర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరక్షరాస్యత నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారులు పాల్గొన్నారు.

మూతపడిన హాస్టల్

● విధుల్లో నలుగురు సిబ్బంది ● 25 గదులు నిరుపయోగం

మూతపడిన రచ్చుమర్రి ఏపీ మోడల్ స్కూల్ హాస్టల్


మంత్రాలయం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రచ్చుమర్రి ఏపీ మోడల్ స్కూల్‌లో తొమ్మిది నెలలుగా ఏపీ మోడల్ బాలికల హాస్టల్ మూతపడింది. ఇందులో ఉండే విద్యార్థులు రాకపోవడంతో నలుగురు సిబ్బంది వృధాగా కాలం గడుపుతున్నారు. హాస్టల్‌కు రావడం, తెరుచుకోవడం, మరలా ఇంటికి వెళ్లి రావడం తొమ్మిది నెలలుగా ఇదే తంతును కొనసాగిస్తున్నారు. గత ఏడాది ఆగస్టు 5న సుంకేశ్వరికి చెందిన పదో తరగతి విద్యార్థిని కురువ పార్వతి హాస్టల్ గదిలో ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. అప్పటి నుంచి పిల్లలు ఎవరూ హాస్టల్‌లో చేరకపోవడం, ఆటోలు, బస్సుల ద్వారా రోజు పాఠశాలకు వస్తూ వెళ్తున్నారు. గతంలో 64 మంది ఉండగా.. 5 మంది టీసీలు తీసుకుని వేరే పాఠశాలలో చేరారు. 9, 10 తరగతులు, ఇంటర్ మొదటి, రెండో సంవత్సరం విద్యార్థులు హాస్టల్‌లో బాలిక ఆత్మహత్య చేసుకున్నప్పటి నుంచి బాలికలు ఆటోల ద్వారా పాఠశాలకు వచ్చి చదువుకుంటున్నారు. ఈ హాస్టల్‌లో చేరాలని మోడల్ స్కూల్‌లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేసినా ఫలితం లేకపోయింది. అయితే.. ఇక్కడ పని చేస్తూ జీతాలు తీసుకుంటున్నారే గానీ, హాస్టల్ నిర్వహణ లేకపోయింది. ఈ హాస్టల్‌లో 25 గదులు ఉన్నప్పటికీ నిరుపయోగంగానే ఉన్నాయి. బాలికల కోసం ఏర్పాటు చేసిన భవనాన్ని మరో అవసరం కోసం వాడుకోవడం, అక్కడ పని చేస్తున్న సిబ్బందిని మోడల్ స్కూల్‌లో పని చేయాల్సిన పనులు చేపట్టకపోవడం మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పట్టించుకోకపోవడమే కారణమని పలువురు విద్యార్థినుల తల్లిదండ్రులు చెబుతున్నారు. విద్యార్థులు లేని హాస్టల్‌లో నలుగురు సిబ్బందికి నెలకు రూ.55,400లు చెల్లిస్తూ సొమ్మును వృథా చేస్తున్నారని తల్లిదండ్రులు వాపోతున్నారు. జూరాల నుంచి వస్తున్న విద్యార్థినుల సైతం అవగాహన కల్పించి హాస్టల్‌లో చేర్చుకోవాల్సిన బాధ్యత సిబ్బంది, ప్రిన్సిపాల్‌పై ఉన్నప్పటికీ అవేమి కూడా పట్టించుకోవడం లేదు. మూతపడిన హాస్టల్‌లో ఉన్న సిబ్బందిని, ఆ గదులను మోడల్ స్కూల్‌కు వినియోగించుకుని ఉన్నతంగా తీర్చిదిద్దే ప్రయత్నాలు చేయాలని అధికారులను తల్లిదండ్రులు కోరుతున్నారు.

మోడల్ స్కూల్ సిబ్బంది రోజూ శుభ్రం చేస్తున్నారు

నలుగురు సిబ్బంది రోజూ వచ్చి హాస్టల్‌ను తెరిచి గదులను శుభ్రం చేస్తున్నారు. ఉన్నతాధికారులకు నివేదికలు పంపామని, వారు ఔట్‌సోర్సింగ్ కావడంతో పై అధికారులు వారిని ఎక్కడ ఉపయోగించుకోవాలో చెప్పడం లేదని అన్నారు. వచ్చే విద్యాసంవత్సరానికి హాస్టల్‌లో విద్యార్థులు చేరకపోతే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తాం. ఇప్పటికే అధికారులకు ఈ విషయాన్ని తెలియజేశాం. వారి నుంచి ఎటువంటి ఆదేశాలు రాకపోవడంతో తొమ్మిది నెలలుగా సిబ్బంది వచ్చి వెళ్తున్నారు.



- ప్రసాద్, ప్రిన్సిపాల్, మోడల్ స్కూల్, రచ్చుమర్రి


విద్యార్థులు లేక ఖాళీగా ఉన్న గది


పిల్లలు లేని హాస్టల్‌లో ఉన్న సిబ్బంది

జీరో డ్రాపౌట్ ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యం

● జిల్లాలో 823మంది విద్యార్థులు తిరిగి పాఠశాలలో చేరిక
● డీఈవో శామ్యూల్ పాల్


విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో

ఎమ్మిగనూరు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో జీరో డ్రాపౌట్స్ ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని డీఈవో శామ్యూల్ పాల్ అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ వివిధ కారణాలతో బడిమానేసిన విద్యార్థులు ఏఏ పాఠశాలల్లో చేరారోనని పరిశీలనలో భాగంగా గురువారం మొట్టమెదటగా ఎమ్మిగనూరు పట్టణంలోని జడ్పీ బాలికోన్నత పాఠశాలను పరిశీలించారు. ఏఏ గ్రామాల పాఠశాలల నుంచి ఎంత మంది డ్రాపౌట్ అయి తిరిగి చేరారో వారి వివరాలను తెలసుకున్నారు. అలాగే ఆయా విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో 53,600మంది విద్యార్థులు వివిధ కారణాలతో బడి మానేశారని, వారి వివరాలను ఎంఈవోలు, సీఆర్పీలుతో తెప్పించుకుని పరిశీలించామన్నారు. కొంత మంది ఆర్థికపరిస్థితి సరిగాలేక, మరి కొంతమంది తల్లిదండ్రుల వెంట వలసవెళ్లటంతో పాటు ఇతరాత్రా కారణాలతో బడిమానేశారన్నారు. అయితే వారి వివరాలను తెప్పించుకొని విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి కౌన్సెలింగ్ ఇచ్చామన్నారు. దీంతో జిల్లావ్యాప్తంగా 823మంది విద్యార్థులు తిరిగి పాఠశాలలో చేరాన్నారు. ఎమ్మిగనూరులోనే అత్యధికంగా 74మంది విద్యార్థులు తిరిగి పాఠశాలలో చేరారన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను బడిలో చేర్పించాలని ప్రభుత్వం అందించే సౌకర్యాలను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు ఆంజనేయులు, మధుసూదన్‌రాజు, హెచ్‌ఎంలు కృష్ణమూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బడీడు పిల్లలు బడిలో ఉండాలి

మంత్రాలయం: బడీడు పిల్లలు బడిలో ఉండేటట్లు చూడాల్సిన బాధ్యత హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులపై ఉందని డీఈవో శ్యామేల్ పాల్ అన్నారు. గురువారం మంత్రాలయం ఉన్నత పాఠశాల మైదానంలో పాఠశాలలో చదివే విద్యార్థులు తల్లిదండ్రుల వెంట వలస వెళ్లి తిరిగి వచ్చి పాఠశాలలో చేర్పించారు. అదేవిధంగా భవిత కేంద్రాన్ని తనిఖీచేసి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 52మంది విద్యార్థులు తిరిగి పాఠశాలలో చేరారని అ నియోజకవర్గంలో వలసలు అధికంగా వెళ్లడంతో పాఠశాలల్లో హాజరుశాతం తగ్గిపోయిందని అన్నారు. వలస వెళ్లిన విద్యార్థులు డ్రాప్‌అవుట్‌గా నమోదు చేశారని, వలసల నుంచి తిరిగి వచ్చిన విద్యార్థులు పాఠశాలల్లో చేరడం శుభ పరిణామమని అన్నారు. ఇంకా కొంతమంది విద్యార్థులు రావాల్సి ఉందని ఈనెల 23లోగా తిరిగి వచ్చిన విద్యార్థులందరిని పాఠశాలలో చేర్పించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఈవో రాగన్న, హెచ్‌ఎం అంపయ్య, రామ్మోహన్, రాఘవేంద్ర, సీఆర్పీలు నర్సన్న గౌడు, బంగారప్ప, భీమేష్, ఐఆర్‌టీ ఉపాధ్యాయులు కళ్యాణి, శివప్రసాద్, సుజాత, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణ పల్లకీలో రాఘవేంద్రుడు


రాఘవరాయడిని బంగారు పల్లకిలో ఊరేగిస్తున్న దృశ్యం

మంత్రాలయం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి స్వర్ణపల్లకిలో భక్తులకు దర్శనం ఇచ్చారు. స్వామివారి దర్శనార్థం వచ్చిన భక్తులతో మంత్రాలయం కిక్కిరిసింది. రాఘవేంద్ర స్వామి సజీవ సమాధి పొందిన గురువారం శుభదినాన్ని పురస్కరించుకొని మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వర్ణ పల్లకీలో రాఘవరాయుడి బృందావన ప్రతిమను అధిష్ఠించి ఆలయ ప్రాంగణం చుట్టూ ఊరేగించారు. భక్తులు గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకొని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. మాధవరం, నాగలదిన్నె, ఎమ్మిగనూరు రోడ్లు వాహనాలతో నిండిపోయాయి.

రాఘవరాయడికి స్వర్ణ కవచం సమర్పణ

వేద పండితుల మంత్రోచ్చారణాలు, మంగళవాయిద్యాల మధ్య రాఘవ్రేంద స్వామి మూల బృందావనానికి బంగారు కవచం సమర్పణ సేవ వైభవంగా నిర్వహించారు. రాఘవేంద్రస్వామి సజీవసమాధి పొందిన గురువారం శుభదినాన్ని పురస్కరించుకొని పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, విశేష పంచామృతాభిషేకం నిర్వహించారు. బంగారు, వెండి, పట్టు వస్త్రాలు, బెంగుళూరు నుంచి తెచ్చిన ప్రత్యేక పుష్పాలు, బంగారు కవచంతో అలంకరించారు.

మఠానికి విరాళం

రాఘవేంద్రస్వామి మఠానికి బెంగళూరుకు చెందిన ధనరాజ్ రూ. లక్ష, ఎంబీ నాగరాజు అనేభక్తులు రూ. రెండు లక్షలు దైనందిక సేవకు విరాళంగా ఇచ్చినట్లు మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజరు వెంకటేష్ జోషి, సురేష్ కోణాపూర్ తెలిపారు. గురువారం వేర్వేరు సమయాల్లో కుటుంబ సమేతంగా రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని నగదు రూపంలో విరాళం ఇచ్చినట్లు తెలిపారు. విరాళం ఇచ్చిన దాతల కుటుంబానికి పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు రాఘవేంద్ర స్వామి మెమెంటో ఇచ్చి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో జేపీ స్వామి, నరసింహ దేశాయ్, గిరిధర్, శ్రీపాధ ఆచార్ పాల్గొన్నారు.

కంటివైద్య శిబిరం ఏర్పాటు అభినందనీయం


రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ హేమంత్ కుమార్

ఎమ్మిగనూరు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): పేదల కోసం ఉచిత కంటివైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని పట్టణ సీఐ శ్రీనివాసులు అన్నారు. గురువారం పట్టణంలోని జీసస్ టెంపుల్ మినిస్ట్రీస్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆర్‌కే కంటి వైద్యశాల సహకారంతో కంటివైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్య శిబిరానికి దాదాపు 200 మంది హాజరయ్యారు. వీరికి కంటివైద్యులు హేమంత్ కుమార్ కంటి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఆపరేషన్ అవసరం ఉన్న వారికి ఆసుపత్రికి రావాలని సూచించారు. వైద్యశిబిరం ఏర్పాటు చేసిన ట్రస్టు నిర్వాహకులను సీఐ శ్రీనివాసులు అభినందించారు. కార్యక్రమంలో ట్రస్టు నిర్వాహకులు డాక్టర్ జి సోలోమోన్, అడ్వకేట్ చార్లెస్, ఎంఈవో ఆంజనేయులు, మల్లేష్, డేవిడ్, షాలేం పాల్గొన్నారు.

నూతన రథానికి పూజలు


నది నుంచి తుంగ జలాలను తీసుకు వస్తున్న భక్తులు

కౌతాళం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మేళిగనూరు గ్రామంలో తుంగభద్రనది తీరాన వెలసిన శ్రీరామలింగేశ్వర స్వామి దేవాలయంలో స్వామివారి నూతనంగా రథానికి గురువారం చెన్న వీర శివాచార్య స్వాముల ఆధ్వర్యంలో ఘనంగా పూజలు చేశారు. ముందుగా ఆలయ కమిటీ నిర్వాహకులు తుంగభద్ర నది నుంచి నీటిని తీసుకువచ్చి జలాభిషేకం చేసి పూజలు చేపట్టారు. దాత సహకారంతో రథాన్ని తయారు చేయించినట్లు తెలిపారు. కార్యక్రమానికి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

ఎస్ఎంఎస్ఎస్ స్కాలర్‌షిప్‌కు విద్యార్థి ఎంపిక

మంత్రాలయం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం జడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థి నరసింహ ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు ఎంఈవో రాగన్న, పాఠశాల హెచ్‌ఎం అంపయ్య తెలిపారు. గురువారం విద్యార్థినిని అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విఠోభరావు, గోపాల్, రామన్న, బసవరాజు, నరసింహరాజు పాల్గొన్నారు.

రీసర్వేలో రైతులకు అన్యాయం జరగనీయొద్దు

● స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.అనురాధ


రీసర్వేపై వివరాలు తెలుసుకుంటున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనురాధ


మంత్రాలయం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం నియోజకవర్గంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీసర్వేలో రైతులకు అన్యాయం జరగకుండా సర్వే చేయాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, మంత్రాలయం ఆర్వో కె.అనురాధ అన్నారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో రీసర్వే జరిగిన గ్రామాల్లో ఎదురైన సమస్యలు, భూసరిహద్దులు, ప్రభుత్వ భూములు, పట్టాదారులు, అనుభవం, కొలతల్లో తేడాలు వంటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రీసర్వే చేస్తున్న సర్వేయర్లపై ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా కొలతలు నిర్ధారించుకునేందుకు అవకాశం కల్పించాలని సూచించారు. గ్రామకంఠం ప్రభుత్వ భూములు, పట్టాదారుల్లో అనుభవదారులను గుర్తించి పక్కాగా కొలతలు నమోదు చేయాలని ఆదేశించారు. అధికారులు నిర్లక్ష్యం వహించకుండా రైతులను సంప్రదించి వారి సలహాలు కూడా తీసుకోవాలని సూచించారు. అనంతరం పైలట్ రీసర్వే గ్రామమైన చెట్నహళ్లికి సంబంధించిన ఫైళ్లను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. సమావేశంలో తహసీల్దార్ ఎస్. రవి, డిప్యూటీ తహసీల్దార్ గురురాజరావు, సరస్వతి, ఆర్ఐ ఆదాం, మండల సర్వేయర్ అశోక్, జయరామిరెడ్డి, వీఆర్వోలు ఆనంద్, భీమన్న గౌడు ప్రభాకర్, శ్వేత, నరసప్ప, సర్వేయర్లు పాల్గొన్నారు.

పెసలదిన్నెలో డెంగీ కేసు నమోదు


పెసలదిన్నె గ్రామంలో ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేసిన వైద్యాధికారులు

ఎమ్మిగనూరు రూరల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెసలదిన్నె గ్రామంలో డెంగీ కేసు నమోదైంది. గ్రామానికి చెందిన ఓ బాలుడికి డెంగీ వ్యాధి నిర్ధారణ కావడంతో వైద్యాధికారులు అప్రమత్తమయ్యాయి. గురువారం గ్రామానికి వెళ్లి వీరాంజనేయుల ఇంటి పరిసరాలను పరిశీలించారు. అలాగే వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. గ్రామంలోని ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి నరసింహులు, సూపర్‌వైజర్ సురేష్, ఏఎన్ఎం లక్ష్మీ, ఎంఎల్‌హెచ్‌పీ నవీన్ పాల్గొన్నారు.

ఏజెన్సీపై చర్యలు తీసుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

ఎమ్మిగనూరు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు చిన్న సైజు కోడిగుడ్లను సరఫరా చేస్తున్న ఏజెన్సీపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌వో, ఆర్‌పీఐఎఫ్ నాయకులు కృష్ణ, సురేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం వారు మాట్లాడుతూ పాఠశాలలకు సరఫరా చేసే కోడిగుడ్లు 50గ్రాములు ఉండాల్సి ఉండగా గుడ్లు చిన్నసైజులో ఉన్నాయని ఆరోపించారు. ప్రభుత్వం విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలన్న లక్ష్యంతో కోట్లు వెచ్చిస్తుంటే, కోడి గుడ్లను సరఫరా చేసే ఏజెన్సీలు మాత్రం తమకు ఇష్టమొచ్చినట్లు సరఫరా చేస్తున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి నాణ్యమైన కోడిగుడ్లు విద్యార్థులకు సరఫరా చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో ఆందోళనలను చేపడతామన్నారు. సమావేశంలో నాయకులు ఇమ్రాన్, రాజు, నితిన్, దినేష్ పాల్గొన్నారు.